


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 285, పేజీలు - 08

గురువారం, ఏప్రిల్ 2, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# వైష్ణవ 'గులాబీ' వర్సెస్ శైవ 'హస్తం'

**- రాష్ట్రంలో ఆధ్యాత్మిక వార్**

**- వైష్ణవ దేవాలయాలకు కేసీఆర్ పెద్దపీట**
**- శివాలయాలకు సీఎం రేవంత్ ప్రాధాన్యత**
**- కేసీఆర్ వదిలేసిన వాటికి రేవంత్ నిధులు**
**- తెలంగాణలో రంజుగా భక్తి ఫైట్!**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఏ లెవల్‌కు వెళ్లాయంటే రేపు పొద్దున ఓటర్లు కూడా ఓటు వేసే ముందు ఏ దేవుడిని నమ్ముతున్నారో చూసుకుని బటన్ నొక్కాల్సి వస్తుందేమో! గత పదేళ్లుగా మన రాష్ట్రాన్ని ఏలిన "వైష్ణవ ప్రియుడు" మాజీ సీఎం కేసీఆర్ యాదాద్రిలో నరసింహస్వామిని కోట్లు ఖర్చు పెట్టి కోవెల కట్టిస్తే, ఇప్పుడు వచ్చిన మన "శివ భక్త" సీఎం రేవంత్ రెడ్డి మాత్రం "మీరు చక్రం తిప్పితే, నేను త్రిశూలం తిప్పుతా" అంటూ శైవ నామాలతో రంగంలోకి దిగారు.

### భక్తి ముసుగులో రాజకీయం

ఇన్నాళ్లూ కేసీఆర్ చినజీయర్ స్వామి సూచనలతో, ఆగమ శాస్త్రాల లెక్కలతో ఎక్కడ చూసినా 'గోవిందా గోవిందా' అనిపించారు. కానీ భద్రాచలం రామయ్యను మాత్రం ఎందుకో కాస్త లైట్ తీసుకున్నారు. అక్కడే మన రేవంత్ అన్నకు రూట్ దొరికింది. "కేసీఆర్ రాముడిని మర్చిపోతే, నేను రాముడికి పట్టువస్త్రాలు ఇస్తూనే, శివుడితో సెల్ఫీలు దిగుతా" అన్నట్లుగా ఆయన ప్లాన్ మార్చేశారు.

### రాహుల్ మార్క్ శైవం.. రేవంత్ మార్క్ శివం!

ఢిల్లీలో రాహుల్ గాంధీ అప్పుడప్పుడు "నేను శివ భక్తుడిని" అని ఫోజులు ఇస్తుంటే ఇక్కడ రేవంత్ రెడ్డి ఆ లైన్ గట్టిగా పట్టేశారు. కేసీఆర్ వేములవాడ రాజన్నకు రూ. 100 కోట్లు ఇస్తానని చెప్పి 'సారీ మర్చిపోయా' అంటే రేవంత్ రెడ్డి మాత్రం "రాజన్నకు నిధులిస్తా, మూసీ గట్టున వంద అడుగుల శివుడిని నిలబెడతా" అని శివతాండవం చేస్తున్నారు. మొత్తానికి పాత పాలనలో 'విష్ణువు' హైలైట్ అయితే కొత్త పాలనలో 'పరమశివుడు' ట్రెండింగ్‌లో ఉన్నారన్నమాట!

### దేవుళ్ల మధ్య పోటీయా? నాయకుల మధ్య పోటీయా?

అసలు ఇక్కడ డౌట్ ఏంటంటే వీరికి భక్తి పెరిగిందా? లేక దేవుళ్లని కూడా విభజించి ఓట్లు దండుకోవాలని ఉందా? కేసీఆర్ మార్క్ భారీ గోపురాలు, శిల్ప కళలు, వైష్ణవ ఆడంబరం కనిపిస్తోంది. ఇక రేవంత్ మార్క్ సాదాసీదా శివ భక్తి, శైవ క్షేత్రాల డెవలప్‌మెంట్, 'జై భోలో' నినాదాలు వినిపిస్తున్నాయి. ఒకరు గాలిలో చక్రం తిప్పాలని చూస్తే,

2లో..

## తేయాకు తోటల్లో ప్రధాని మోదీ

**- అస్సాం ఎన్నికల ప్రచార చిత్రం**



**దిబ్రూగఢ్ (ప్రశ్న న్యూస్)** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలకు హాజరయ్యే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ అనూహ్యంగా తేయాకు తోటల్లో ప్రత్యక్షమై అక్కడి మహిళా కార్మికులను ఆశ్చర్యపరిచారు. బుధవారం దిబ్రూగఢ్‌లోని ఓ తేయాకు తోటను సందర్శించి అక్కడ పనిచేస్తున్న మహిళలతో ప్రధాని మోదీ ముచ్చటించారు. తేయాకు సేకరణ విధానాన్ని పరిశీలించారు. తేయాకు సేకరణ, రవాణ, విక్రయాల వివరాలను తెలుసుకున్నారు. వారితో కలిసి అస్సాం సాంప్రదాయ నృత్యంలో సందడి చేశారు. తేయాకు తోట సందర్శన, అస్సాం మహిళలతో ముచ్చట వారి స్వాగత నృత్యాలపై స్వయంగా మోదీ ఎక్స్ వేదికగా తన అనుభవాన్ని తెలిచేశారు.

2లో..

## రేషన్ కార్డుల ఏరివేత పైశాచికం



**- కార్డులు తొలగిస్తే పోరాటం తప్పదు**
**- రేవంత్ సర్కార్‌కు కవిత వార్నింగ్**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రేషన్ కార్డులు ఏరివేసే పైశాచిక ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని రేవంత్ సర్కార్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరించారు. ఐటీ రిటర్న్ దాఖలు చేశారని, చిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారనే కారణంతో రేషన్ కార్డులు ఏరివేసే ప్రయత్నం చేస్తున్నారని ఫైరయ్యారు. చిరుద్యోగులకు మేలు జరిగే రేషన్ కార్డుల విషయంలో పైశాచిక పనులు చేయవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నానని అన్నారు. జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోలతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. డిగ్రీ లెక్చరర్ల ఉద్యోగాలను తమవారికే ఇచ్చేలా జీవో నంబర్ 4 తీసుకొచ్చిందని ఆరోపించారు.'హీహెచ్‌డీకి 25 మార్కులు వెయిటేజ్ ఇవ్వటం కూడా కుట్రలో భాగమే. గ్రూప్-1 లో ఏ విధంగా తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారో ఇప్పుడు అదే కుట్ర చేస్తున్నారు. ప్రతి నోటిఫికేషన్‌కు ఏదో ఒక జీవో అడ్డం పెట్టి నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారు. డీఎస్సీకి జీవో నంబర్ 104, గ్రూప్స్‌కు జీవో నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జీవో నంబర్ 46, గురుకులాలకు జీవో నంబర్ 81 లు అడ్డంకిగా ఉన్నాయి. ఈ జీవోలను వెంటనే రివ్యూ చేసి రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే నిరుద్యోగులను సమాయాత్తం చేసి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. నిరుద్యోగ యువతను కాంగ్రెస్ తమ రాజకీయ లబ్ధికోసం వాడుకుంది. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ హామీ ఇచ్చి ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.
రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు చెబితే నమ్మరని రాహుల్ గాంధీతో అశోక్ నగర్‌లో హామీ ఇప్పించారు. రాష్ట్రంలో 30 నుంచి 40 లక్షల కుటుంబాల్లో విద్యార్థులు పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నారు. నేను తొక్కుకుంటూ పైకి వచ్చాను అంటూ ముఖ్యమంత్రి

2లో..

## అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం

**- కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని విమర్శ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో

2లో..

## ఏపీకి శాశ్వత రాజధానిగా అమరావతి

**- లోక్‌సభలో అమరావతి బిల్లు ఆమోదం - ఇండీ కూటమి పార్టీలు కూడా మద్దతు!**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా మరో అడుగు ముందుకు పడింది. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభ ఆమోదించింది. ఏపీ పునర్విభజన సవరణ చట్టం బిల్లు పేరుతో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం రెండు గంటల పాటు టీడీపీ, బీజేపీ, వైసీపీ, జనసేన సహా వివిధ పార్టీల సభ్యులు బిల్లుపై చర్చించారు. ఆ తర్వాత అమరావతి బిల్లును లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. చర్చ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బిల్లుకు మద్దతిచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా వాకౌట్ చేశారు. గురువారం రోజున ఈ బిల్లును కేంద్రం రాజ్యసభ ముందుకు తీసుకురానుంది. మరోవైపు అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అమరావతి ఆంధ్రుల కలల రాజధానిగా అభివర్ణించారు. అమరావతి కోసం భూములను త్యాగం చేసిన రైతులకు అభినందనలు తెలియజేశారు. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేయాలన్న పెమ్మసాని చంద్రశేఖర్ అమరావతి ఉద్యమంలో పోరాడిన మహిళలకు

2లో..

## మీ సేవ కేంద్రాల్లో పెరిగిన సర్వీస్ ధరలు

**- ఏప్రిల్ 1 నుంచే అమలు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో వివిధ రకాల ధృవీకరణ పత్రాలు, బిల్లు చెల్లింపుల కోసం వసూలు చేసే యూజర్ ఛార్జీలను భారీగా పెంచింది. ఈ మేరకు ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కనిష్టంగా రూ. 35 ఉన్న సర్వీస్ ఛార్జీని ఇప్పుడు ఏకంగా రూ. 62కు పెంచారు. పెరిగిన

2లో..

## ఇంధనం, వనరులు లోటు లేకుండా చర్యలు

**- ప్రధాని మోదీ కీలక సమావేశం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇరాన్ యుద్ధంతో ప్రపంచ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇరాన్ మీదుగా వచ్చే చమురు ఆగిపోవడంతో దాదాపు అన్ని దేశాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ కూడా ఇదే పరిస్థితిలో ఉంది. పరిస్థితి ప్రస్తుతానికి అదుపులోనే ఉన్నప్పటికీ ఇదే సిచ్యుయేషన్ కొనసాగితే ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై ప్రధానమంత్రి మోదీ కేబినెట్ కమిటీ

2లో..

## అమరావతిపై చంద్రబాబుది డ్రామా

**- రాజధానిపై మా విజన్ 'మావిగన్'**



అమరావతి (ప్రశ్న న్యూస్) అమరావతికి వ్యతిరేకం కాదు కానీ శాశ్వత రాజధానికి ఒప్పుకోం ఇదీ వైఎస్సార్సీపీ విధానం. నాలుగు రోజులుగా రకరకాల స్టేట్‌మెంట్లు ఇచ్చిన వైఎస్సార్సీపీ ఇవాళ కూడా పూర్తి క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు ఇంకో కన్ఫ్యూజన్ క్రియేట్ చేసింది. రాజధానిగా ప్రస్తుతం ఉన్న ప్రాంతాన్ని రాజధానిగ్గ ప్రతిపాదిస్తూ ఏపీ పునర్వవస్తీకరణ చట్టంలో సవరణ జరుగుతున్న ప్రయత్నంపై నిర్థిష్టంగా అభిప్రాయం చెప్పకుండా రాజధాని ప్రాంతంపై ఓ కొత్త ప్రతిపాదన తెచ్చారు. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్. అదే మావిగన్.
పార్లమెంట్‌లో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లుపై చర్చ జరగడానికి కొద్ది సేపటి ముందు

2లో..

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా వైసీపీ రాజకీయాలు

**- నెల్లూరు 'పేదల సేవలో' సీఎం చంద్రబాబు**



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

### హిట్ అండ్ రన్ కంటే దారుణం

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018-19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు.
కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో

2లో..

## రైతు ఇంటి నుంచే అన్ని భూ సేవలు



**- తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో సంచలనం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామని అన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల

2లో..

# అమరావతిపై చంద్రబాబుది డ్రామా

ఓటింగ్‌కు తాము హాజరవుతామని బిల్లును సమర్థిస్తామని వైస్సార్సీపీ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. కానీ, ఆ కొద్దిసేపటికి ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహనరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టారు. అమరావతికి తాము అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ వ్యతిరేకం కాదని చెబుతూనే.. ఇంతవరకూ ఎవరూ ఆలోచించని మావిగన్ ప్రతిపాదన తెచ్చారు.

### అమరావతి కాదు.. మావిగన్

తాడేపల్లి మీడియా సమావేశంలో జగన్ మోహనరెడ్డి ఓ కొత్త ప్రతిపాదన తెచ్చారు. అదేంటంటే మావిగన్. విచిత్రంగా ఉన్న ఈ పేరను ఆయనే సూచించారు. ఇదేంటంటే ప్రస్తుతం ఉన్న అమరావతి ప్రాంతాన్ని విస్తరించాలని సూచించారు. "విజయవాడ నుంచి మచిలీపట్నానికి 70 కి.మీ - విజయవాడ నుంచి గుంటూరుకు 40 కి.మీ - మొత్తం 110 కి.మీలలో నేషనల్ హైవే ఉంది - దీన్ని మొత్తం క్యాపిటల్ గా ప్రకటించండి - 'మావిగన్' అని పేరు పెట్టండి - రూ. 2లక్షల కోట్లలో 10% పెడితే చాలు -- అమరావతిలో 2 లక్షల కోట్లు పెడితే రాష్ట్రం, ప్రజలు ఏం కావాలి - రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్ లాంటి రాజధాని కావాలి " అన్నారు. అమరావతికి తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. అయితే రాజధాని పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆ దోపిడీని డైవర్ట్ చేయడానికే శాశ్వత హోదా అనే డ్రామాలాడుతున్నారని జగన్ అన్నారు.

### అమరావతికి మద్దతుపై పిల్లిమొగ్గలు

జగన్ ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న సమయంలోనే పార్లమెంట్‌లో ఈ బిల్లు చర్చకు వచ్చింది. దీనిపై వైస్సార్సీపీ తీవ్ర గందరగోళంలో పడింది. నిన్నటి వరకూ ఆ పార్టీ నేతలు వ్యాఖ్యలు చూస్తే బిల్లుకు మద్దతివ్వరనిపించింది. ఆ తర్వాత ఇవాళ పొద్దున బిల్లును సమర్థిస్తున్నామని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు మిథున్ రెడ్డి చెప్పినట్లు వార్తలు వచ్చాయి, తీరా బిల్లు హౌస్‌లోకి వచ్చాక బిల్లును వ్యతిరేకిస్తున్నామని చెప్పి వాకౌట్ చేశారు, ఓ వైపు ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేస్తుంటే ఇంకో వైపు కొద్ది క్షణాల ముందు ఆ పార్టీ అధినేత జగన్ అమరావతి గురించి మాట్లాడారు.

### అమరావతి పేరుతో దోపిడీ

అమరావతి ప్రాంతాన్ని రాజాధానిగా అంగీకరిస్తున్నామని చెబుతూనే చంద్రబాబు ప్రభుత్వం రాజధాని పేరుతో దోపిడీ చేస్తోందని జగన్ ఆరోపించారు. అవినీతిపై ప్రజల దృష్టిని మరల్చేందుకే శాసనసభలో అమరావతిపై తీర్మానం అనే ఒక డ్రామా చేశారన్నారు. "రాజ్యాంగంలో ఎక్కడా రాజధాని అనే పదం లేదు అని ఛత్తీస్ గఢ్, జార్ఖండ్ రాజధానులను కేంద్రం నిర్ణయించలేదని ఆయా రాష్ట్రాలే రాజధానులను నిర్ణయించుకున్నాయని చెప్పారు. "ఏడేళ్లు సీఎంగా ఉండి అమరావతిలో మీరు చేసిందేంటి? - భూములిచ్చిన రైతుల హామీలు నెరవేర్చారా? - అమరావతిని ఎందుకు పెంచుకుంటూ పోతున్నారు?" అని ప్రశ్నించారు. "రోడ్లు, డ్రైనేజీలకే ఎకరానికి రూ.2 కోట్లు అవుతుందని చంద్రబాబు లెక్కలే చెప్తున్నాయి - ఆ లెక్కన లక్ష ఎకరాలకు 2 లక్షల కోట్లు కావాలి - రూ.2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వస్తాయని జగన్ నిలదీశారు.2014-19 మధ్య రూ.5,335 కోట్లు ఖర్చు చేశారు - ఈ రెండేళ్లలో అమరావతికి బాబు చేసిన అప్పు 47వేల కోట్లు - అమరావతి కోసం ఏడేళ్లలో మొత్తం 8వేల కోట్లు ఖర్చు చేశారు - ఏడేళ్లలో 8వేల కోట్లు ఖర్చు పెడితే రూ.2లక్షల కోట్లు ఖర్చు చేయడానికి ఎన్నేళ్లు పడుతుంది - అమరావతిలోనే వేల కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరిస్థితేంటన్నారు. 2019కి ముందు మాస్టర్ ప్లాన్ ను ఎందుకు మారుస్తున్నారు - ఒకప్పుడు వరల్డ్ క్లాస్ సిటీ అని చంద్రబాబు ఊదరగొట్టారు - ఇప్పుడు మున్సిపాలిటీగా మిగిలిపోతుందని ఎందుకంటున్నారు - వరదపు అడుగుకు 11 వేల నుంచి 14వేలు అవుతుందని చెప్తున్నారు ఇదేక్కడైనా ఉందా అని ప్రశ్నించారు.

### అమరావతిలో చంద్రబాబు మనస్ఫూర్తిగా ఉన్నాడా.?

అమరావతికి తానెప్పుడూ వ్యతిరేకం కాదని జగన్ స్పష్టం చేశారు. 12 ఏళ్లలో మనస్ఫూర్తిగా చంద్రబాబు అమరావతిలో ఉన్నారా? - ఇప్పటికీ కూడా మీ కుటుంబాలు ఎక్కడున్నాయి అంటూ జగన్ కామెంట్ చేశారు. 2019 వరకు హైదరాబాద్ కు షటిల్ సర్వీస్ చేశారు - ఇప్పుడు కూడా హైదరాబాద్ కు షటిల్ సర్వీసే - పవన్, లోకేష్ 4 రోజులు కూడా అమరావతిలో ఉండటం లేదని ఆక్షేపించారు. రాష్ట్రంపై భారం పడకూడదని, అభివృద్ధి, సంక్షేమం కుంటుపడకూడదని మనం కూడా చెన్నై, బెంగళూరుతో పోటీ పడాలని.. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ గా చేశాం - శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం హైకోర్టు పెట్టాలనేది ఒప్పందం - ఒప్పందాన్ని గౌరవిస్తూ కర్నూలును న్యాయ రాజధాని చేశాం. అమరావతిని ఏనాడూ మేం నిర్లక్ష్యం చేయలేదు - అమరావతిలో భూములిచ్చిన రైతుల కౌలు పెంచాం అని జగన్ గుర్తు చేశారు.

# రైతు ఇంటి నుంచే అన్ని భూ సేవలు

పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని తెలిపారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

### నేడు 5 జిల్లాల్లోప్రయోగాత్మక అమలు

ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. నేటి నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

### ఇంటి నుంచే భూ సేవలు

'గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన పనిలేకుండా తన ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్నిఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంతచెల్లించాలో కనిపిస్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుంది. ఆతర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమేగాక సర్వేకూడా రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్‌ల కేటాయింపు జరుగుతుంది. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎమ్ ఎస్ అలర్ట్స్ పంపిస్తారు.

### ప్రతీ సర్వే నంబర్‌కు భూధార్ నెంబర్

'భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ ( ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదేవిధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డివెల్లడించారు.ఈ ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నతర్వాత సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామని అలాగే గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలు రైతు జీవితంలో పెద్ద అడ్డంకిగా మారాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అని రైతు ఇంటి నుంచే అన్నిసేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని ఇది రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు నాంది అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో

# హెల్త్ క్యాంపు నిర్వహణ



**రాజపేట ఏప్రిల్:** రాజపేట మండలంలోని సింగారం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజాపేట లోని ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో సింగారం గ్రామం లో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. దీనికి సర్పంచ్ కొండ ప్రమీల పాండరి ఉపసర్పంచ్ కరుణాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ హెల్త్ క్యాంప్ లను అందరూ వినియోగించుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఇటువంటి కార్యక్రమం వలన అందరికీ వైద్యం అందుతుందని వారు పేర్కొన్నారు. ఇందులో బిపి షుగర్ క్యాన్సర్ టీబీ వారికి రక్త పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మోసెస్ రాజ్, భీకు నాయక్ హెచ్ ఈ ఓ, ప్రేమలత పీహెచ్ఎన్, పంచాయతీ కార్యదర్శి రాజమహేందర్ రెడ్డి,ఉషా రాణి ఎమ్మెల్ హెచ్ పి సులోచన గ్రామస్తులు పాల్గొన్నారు.

# మీ సేవ కేంద్రాల్లో పెరిగిన సర్వీస్ ధరలు

ధరలు ఏప్రిల్ 1 నుంచే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తాజా పెంపు ప్రకారం తక్షణమే లభించే ఏ-కేటగిరీ సర్టిఫికెట్ ప్రింట్ వంటి సేవలకు రూ. 62 వసూలు చేయనుండగా ఇన్‌కం, క్యాస్ట్, నివాస ధృవీకరణ పత్రాల వంటి బి-కేటగిరీ సేవలకు రూ. 80గా ధరను నిర్ణయించారు. వీటితో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఆర్టీఏ సేవలు, ఇతర ప్రభుత్వ అప్లికేషన్లపై కూడా అదనపు భారం పడనుంది.ఇన్‌కం సర్టిఫికేట్‌కు గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా తాజా సవరణల ప్రకారం రూ.80కి చేరింది. కుల ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి 55 ఉండగా ఇప్పుడు రూ.80కి చేరింది. స్థానికత ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా ప్రస్తుతం రూ.80కి పెంచారు. అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ గతంలో రూ.40 నుంచి 45 ఉండగా తాజాగా రూ.62కు పెంచారు. దీంతో సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు అప్లయ్ చేసుకునే సమయంలో విద్యార్థులు క్యాస్ట్, ఇన్‌కం, నివాస ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా ఈ మూడింటి ధరలను ఏకంగా 80 రూపాయలకు పెంచడం వల్ల మధ్యతరగతి, పేద వర్గాల విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది.కాగా, చాలా కాలంగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు తమకు వచ్చే కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెరిగిన విద్యుత్బిల్లులు, ఇంటర్నెట్, సిబ్బంది ఖర్చుల దృష్ట్యా ఈ పెంపు అనివార్యమని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ క్రమంలోనే తాజాగా ఛార్జీలు పెంచారు. అయితే ఛార్జీలను భారీగా పెంచటంపై సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### వాట్సాప్ మీ-సేవ సూపర్ హిట్

ఇదిలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ మీ-సేవ విధానానికి ప్రజల నుంచి భారీ ఆదరణ లభిస్తోంది. కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో 581 రకాల ప్రభుత్వ సేవలను పొందే వెసులుబాటును సర్కార్ కల్పించింది. 8096958096 నంబర్ ద్వారా 24 గంటల పాటు 10కి పైగా ప్రభుత్వ శాఖల సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ వంటి 10కి పైగా కీలక ప్రభుత్వ శాఖలకు చెందిన ధృవీకరణ పత్రాలు, బిల్లుల చెల్లింపులు వంటి సేవలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. మీ-సేవ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా తక్కువ సమయంలో పారదర్శకంగా సేవలు అందుతుండటంతో డిజిటల్ తెలంగాణ దిశగా ఇది ఒక కీలక అడుగుగా నిలిచింది.

# ఇంధనం, వనరులు లోటు లేకుండా చర్యలు

ఆఫ్ సెక్యూరిటీతో సమావేశమయ్యారు. ప్రభుత్వం పూర్తి స్థాయి కార్యాచరణ చేపట్టేందుకు తీసుకోవాలని చర్యల గురించి సీసీఎస్ చర్చించారు. సాధారణ ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువుల లభ్యత, సరఫరాపై సవివరంగా సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో ప్రధానమంత్రి, ప్రస్తుత ప్రపంచ సంక్షోభం ప్రభావాన్ని సామాన్య పౌరులపై తగ్గించడానికి సాధ్యమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆయన తప్పుడు సమాచారం, వదంతులను కూడా తీవ్రంగా పరిగణిస్తూ, ప్రజలకు కచ్చితమైన, సకాలంలో సమాచారం అందించడం చాలా కీలకమని అన్నారు. సీసీఎస్ సమావేశానికి పలువురు సీనియర్ మంత్రులు హాజరయ్యారు.

### సీసీఎస్ సమావేశంలో సూచనలు

ఈ సమావేశంలో ఇంధనం, అవసరమైన వనరులు లోటు లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. రాబోయే నెలల్లో విద్యుత్ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు.

అంతేకాకుండా వివిద వనరుల నుంచి ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాను నిర్ధారించే చర్యలు, ఇంధన పన్నుల తగ్గింపు, విద్యుత్ రంగానికి సంబంధించిన చర్యలను సమీక్షించారు. వ్యవసాయం, ఎరువులు, నౌకా రవాణా, విమానయానం, లాజిస్టిక్స్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగాల్లో తలెత్తుతున్న సవాళ్లను పరిష్కరించే వ్యూహాలపై కూడా ప్రభుత్వం చర్చించింది. నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడానికి, నిల్వలను, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

### కొత్త సవాళ్లు అధిగమించేందుకు చర్యలు

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో నిరంతరం సమన్వయం చేసుకునేందుకు నియంత్రణ గదులను ఏర్పాటు చేశారు. ఎరువుల సరఫరాను కొనసాగించడానికి, దేశంలో ఎలాంటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు యూరియా ఉత్పిని కొసాగించడంపైనా, డీఏపీ/ఎనపీకేఎస్ కోసం విదేశీ సరఫరాదారులతో సమన్వయాన్ని పెంచడంపైనా కూడా దృష్టి సారించారు.

## సాగునీటి ప్రాజెక్టులను

# వేగవంతం చేయాలి

## - మంత్రి సవిత

**పుట్టపర్తి** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (ఆఖీఅ) సమావేశంలో ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి సవిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను సమీక్షించి, జిల్లా అభివృద్ధికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి పేర్కొన్నారు.

అదేవిధంగా, జిల్లా అభివృద్ధి పనుల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ప్రజాప్రతినిధులకు నిరంతరం సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# వైష్ణవ 'గులాబీ' వర్సెస్ శైవ 'హస్తం'

మరొకరు నిప్పు కన్ను తెరుస్తానని హింట్లు ఇస్తున్నారు. కానీ పాపం జనం మాత్రం "అయ్యా.. మీరు వైష్ణవమో, శైవమో మాకు అనవసరం మాకు కొంచెం వర్షాలు కురిపించి, రోడ్లు వేయించి, మా బతుకులు బాగు చేస్తే ఏ దేవుడైనా ఒక్కటే!" అని ముక్కున వేలేసుకుంటున్నారు.రాజకీయ నాయకుల భక్తి ఎప్పుడూ 'సీజనల్' వ్యాధి లాంటిదే. ఎన్నికలప్పుడు గుళ్లు తిరగడం కామన్, కానీ ఇలా 'శాఖల' వారీగా దేవుళ్లను పంచుకోవడం మాత్రం విచిత్రం. కేసీఆర్ వైష్ణవంతో 'మోక్షం' పొందాలనుకుంటే, రేవంత్ రెడ్డి శైవంతో 'శక్తి'ని ప్రదర్శిస్తున్నారు. రేపు ఇంకెవరైనా వచ్చి "మేము శాక్తేయులం" అని అమ్మవారిని పట్టుకొస్తారో ఏమో!చివరికి ఏ దేవుడు కరుణిస్తాడో కానీ తెలంగాణ ఓటర్లు మాత్రం ఈ "ఆధ్యాత్మిక వార్" చూసి తెగ ఎంజాయ్ చేస్తున్నారు!

# తేయాకు తోటల్లో ప్రధాని మోదీ

ఇది ఒక అత్యంత మధురమైన అనుభవం అని పేర్కొన్నారు. తేనీరు అస్సాం ఆత్మ! అని, ఇక్కడి తేనీరు ప్రపంచవ్యాప్తంగా తన స్థానాన్ని సంపాదించుకుందని ప్రశంసించారు. మరోవైపు ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఇలాంటి స్టంట్లు అలవాటేనంటూ ప్రతిపక్షాలు సెటైర్లు వేశాయి.

# ఏపీకి శాశ్వత రాజధానిగా అమరావతి

అభినందనలు తెలిపారు. వికేంద్రీకరణ పేరుతో గత ప్రభుత్వం మూడు ప్రాంతాల నడుమ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. అమరావతి రైతులు, మహిళల కన్నీళ్లే ఈ చట్టానికి పునాదిగా మారాయని పెమ్మసాని చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందా? అనే అనుమానానికి ఈ చట్టసవరణతో ముగింపు పలకాలని అన్నారు.ఈ చర్చలో ఇండీ కూటమి అనూహ్యంగా బిల్లుకు మద్దతు ప్రకటించడం విశేషం. కాంగ్రెస్ పార్టీ తరపున మాణికం ఠాగూర్ వంటి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని ఏర్పాటు ఉండాలని, అమరావతికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం రాజకీయాల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రతిపక్ష సభ్యులు పేర్కొన్నారు. దీంతో బిల్లుపై చర్చలో మెజారిటీ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి సానుకూలత వ్యక్తం చేశాయి. అయితే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. వైసీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ చర్చకు సమాధానమిస్తూ ఏపీ అసెంబ్లీ తీర్మానం మేరకే ఈ సవరణ చేస్తున్నామని, ఇది రాష్ట్ర ప్రగతికి ఊతమిస్తుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు , ఇతర విభజన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. చర్చ అనంతరం స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో మూజువాణి ఓటు ద్వారా ఈ బిల్లును ఆమోదించారు. గురువారం ఈ బిల్లు రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. రాజ్యసభలో ఆమోదం తర్వాత రాష్ట్రపతి కి పంపుతారు. అక్కడ తుది ఆమోదం తరవాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. దాంతో ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతం అవుతుంది. మళ్లీ మార్చాలంటే పార్లమెంట్ లోనే చట్టం చేయాల్సి ఉంటుంది.

## అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం

తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రేషన్ కార్డుల ఏరివేత పైశాచికం

చెబుతుంటారు. నిజంగానే నిరుద్యోగుల నెత్తి మీద కాలు పెట్టి తొక్కుకుంటూ మీరు అధికారంలోకి వచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాక బాలింతలకు డబ్బులు, కిట్‌లు ఇవ్వటం మానేసింది. అంగన్ వాడీలకు జీతాలు కూడా సరిగా ఇవ్వటం లేదు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఏడు వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటే ఇవ్వటం లేదు. కానీ మూసీకి మాత్రం 7 వేల కోట్లు కేటాయించారు.

మీరు హామీ ఇచ్చిన విధంగా 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఎందుకు ఇవ్వటం లేదు. రాష్ట్రంలో ఏ నోటిఫికేషన్ వేసిన సరే దానికి ఏదో ఒక జీవో అడ్డంగా మారింది. సిన్సియర్‌గా ఆ జీవోల మీద ఈ ప్రభుత్వం ఎందుకు రివ్యూ చేయటం లేదు. ఇప్పుడు డిగ్రీ లెక్చరర్ల నోటిఫికేషన్‌కు జీవో నంబర్ 4 అడ్డంగా మారింది.

డీఎస్సీకి జీవో నంబర్ 104, గ్రూప్స్‌కు జీవో నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జీవో నంబర్ 46, గురుకులాలకు జీవో నంబర్ 81, ఆడబిడ్డలకు రిజర్వేషన్లు రాకుండా చేస్తున్న జీవో నంబర్ 4. ఎందుకు ఈ జీవోల మీద సిన్సియర్‌గా ప్రభుత్వం రివ్యూ చేయటం లేదు. వెంటనే ఈ మొత్తం జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నా. 2011 తర్వాత ఇప్పటి వరకు డిగ్రీ లెక్చరర్ల నోటిఫికేషన్ వేయలేదు.

9 నెలల క్రితం పెట్టిన నర్సింగ్ ఎగ్జామ్ ఫలితాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇన్ని లక్షల మంది ఎఫెక్ట్ అయ్యే జీవో ల మీద రివ్యూ చేసే సమయం ఈ ప్రభుత్వానికి లేదా?ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు అడ్డుగా ఉన్న జీవోలను వెంటనే రద్దు చేయాలి లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలు తిరిగి నిరుద్యోగులను సమాయాత్తం చేస్తాం నోటిఫికేషన్లు వేసే వరకు ప్రభుత్వంతో ఫైట్ చేస్తాం. ఇక అంశం ఇలా ఉంటే మూలిగే నక్క పై తాటి పండు పడినట్లు రేషన్ కార్డుల అంశం మారింది. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదంటూ ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుంది. ఈ ప్రభుత్వం 5 లక్షల రేషన్ కార్డులు ఇస్తే 10 నుంచి 15 లక్షల రేషన్ కార్డులను తీసేసే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరిస్తున్నా.' అని కవిత వార్నింగ్ ఇచ్చారు.

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా

# వైసీపీ రాజకీయాలు

పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### సంక్షేమ పథకాల వెల్లువ

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

### అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం

సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం వంటి పోర్టులు రానున్నాయని తెలిపారు. ఉదయగిరిలో డ్రోన్లు, మానవ రహిత విమానాల తయారీ పరిశ్రమ రాబోతోందని, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారిందని అన్నారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

### సుపరిపాలన - చేనేతలకు వరం

సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ మహాయజ్ఞానికి ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని, ప్రభుత్వ సేవల్లో లోపాలుంటే ఆకస్మిక తనిఖీలు చేస్తానని హెచ్చరించారు. డిసెంబరు నాటికి 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు.

ఈ సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 11,443 పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, ఇందుకోసం రూ.153 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అనంతరం, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేనేతలు సీఎంను నూలు దండతో సత్కరించారు.

## అరవిందబాబు 10 గంటల పాటు హైడ్రామా

**గుంటూరు** పల్నాడు జిల్లా నరసరావుపేట టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి తన తీరుతో వార్తల్లో నిలిచారు. జిల్లా పోలీసు విభాగానికి లీగల్ అడ్వైజర్‌గా తాను సిఫార్సు చేసిన వ్యక్తిని వెంటనే నియమించాలంటూ మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏకంగా 10 గంటల పాటు బైఠాయించి హైడ్రామా సృష్టించారు. ఈ ఘటనపై టీడీపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.ఎనిమిది నెలల క్రితం తాను సిఫార్సు చేసిన రామినేని ప్రసాద్‌ను లీగల్ అడ్వైజర్‌గా నియమించాలని కోరుతూ ఎమ్మెల్యే అరవింద బాబు మంగళవారం ఉదయం 11:30 గంటలకు ఎస్పీ బి.కృష్ణారావును కలిశారు. దీనిపై విచారణ జరిపి ఉత్తర్వులిస్తానని ఎస్పీ చెప్పగా, నియామక పత్రం చేతికిచ్చే వరకు కదిలేది లేదని ఎమ్మెల్యే ఎస్పీ ఛాంబర్‌లోనే భీష్మించుకుని కూర్చున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.సాయంత్రం వరకు నిరసన కొనసాగించిన ఎమ్మెల్యే, ఒక దశలో ఎస్పీ ఛాంబర్‌లోని బాత్రూంలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. మంత్రులు నారా లోకేశ్, అనిత కార్యాలయాల నుంచి ఫోన్లో మాట్లాడినా ఆయన బయటకు రాలేదు. దీంతో పోలీసులు డంబెల్స్‌తో బాత్రూం డోర్ పగలగొట్టి ఆయన్ను బయటకు తీసుకురావాల్సి వచ్చింది. చివరకు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఇతర టీడీపీ నేతలు వచ్చి బుధవారం సాయంత్రం 5 గంటలలోపు నియామక ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి 9:45 గంటలకు ఆయన ధర్నా విరమించారు.ఇదే రోజు ఉదయం ఆర్డీవో కార్యాలయంలోనూ ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కోసం ఎమ్మెల్యే గంటపాటు ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. గతంలో ఎక్సైజ్ కమిషనరేట్ కార్యాలయంలోనూ ఆయన ఇలాగే ప్రవర్తించడం వివాదాస్పదమైంది. ఆ ఘటనపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే ఆయనను వివరణ కోరిన నేపథ్యంలో, తాజా ఘటనతో ఆయన తీరుపై పార్టీ నాయకత్వం మరింత సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

## మీరు లైడిటేక్టర్ టెస్టులు

**హైదరాబాద్** సినిమా ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలతో తెలంగాణలోని జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వార్తల్లో నిలిచారు. చిత్రసీమలో మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం ఎక్కువ అయ్యిందని ఆయన విమర్శలు చేశారు. అక్కడితో ఆగలేదు. వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అసలు ముందు అనిరుధ్ రెడ్డి ఏం అన్నారు? అనే అంశంలోకి వెళితే...డ్రగ్స్ టెస్టులకు, సినిమా విడుదలకు ముడి పెట్టారు అనిరుధ్ రెడ్డి చిత్రసీమలో నటీనటులు అందరూ ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని, డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం అయితేనే వాళ్ళ సినిమాలు విడుదల చేయాలనే నిబంధన తీసుకు రావాలని ఆయన పేర్కొన్నారు. రాజకీయ నాయకులు చెప్పే దానికంటే హీరోలు, నటీనటులు చెప్పేది ప్రజలు ఎక్కువ వింటారని, వాళ్ళు డ్రగ్స్ తీసుకున్నారని తెలిస్తే అభిమానులు సైతం వాళ్ళకు దూరంగా ఉంటారని అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారునటీనటులు డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కథానాయకుడు, నటుడు రాహుల్ రామకృష్ణ స్పందించారు. తాను హీరో కాకపోయినా అనిరుధ్ రెడ్డి సూచించిన టెస్టులు చేయించుకోవడానికి మాత్రం రెడీ అన్నారు. అర్జెంటుగా జీవో జారీ చేస్తే అందరం కలిసి చెయ్యిచ్చుకుందామని చెప్పారు. అయితే ఒక మెలిక పెట్టారు. కథానాయకుడు, 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు సైతం అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రియాక్ట్ అయ్యారు. మరి ఎన్నికల్లో నామినేషన్స్ ఫైల్ చేసే ముందు నాయకులు ఎటువంటి టెస్టులు చేయించుకోవాలని ప్రశ్నించారు.మేము (నటీనటులం) డ్రగ్ టెస్టులు, మీరు (రాజకీయ నాయకులు) లై డిటెక్టర్ టెస్టులు... ప్రతి ఆదివారం ఈ గొప్ప కార్యక్రమం పెట్టుకుందాం. అప్పుడే మీ మాట, మా మాట నమ్మి ప్రజలు అందరూ అభివృద్ధి చెందుతారు" అని రాహుల్ రామకృష్ణ పేర్కొన్నారు. సోషల్ నెట్వర్కింగ్ సైట్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. మరి ఆయన రియాక్షన్ పట్ల అనిరుధ్ రెడ్డి స్పందిస్తారో లేదో చూడాలి

## ఇప్ప చెట్లకు అనుమతులు ఇవ్వండి

**హైదరాబాద్,** తెలంగాణలో 10 లక్షల ఇప్ప చెట్లు నాటాలంటూ జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించిన ఉద్యమం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా మేలు చేస్తుందన్న ఆయన డిమాండ్‌కు వివిధ పార్టీలకు చెందిన 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మద్దతుగా నిలవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా ఇప్ప పువ్వు, ఇప్ప ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరిస్తున్న అనిరుధ్ రెడ్డి, తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన, ఇప్పుడు ఏకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్ప చెట్ల పెంపకాన్ని ప్రభుత్వమే ఒక ఉద్యమంలా చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఈ డిమాండ్‌కు అనూహ్యంగా పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధుల నుంచి మద్దతు లభిస్తోంది.ముఖ్యమంత్రికి రాసిన లేఖలో అనిరుధ్ రెడ్డి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలోని అర్ధ శుష్క ప్రాంతాల వాతావరణానికి ఇప్ప చెట్లు ఎంతో అనువైనవని, ఇవి కరువును సైతం తట్టుకుని బలంగా పెరుగుతాయని వివరించారు. ఇప్ప చెట్లు నేల సారాన్ని పెంచడంతో పాటు భూక్షయాన్ని సమర్థంగా నివారిస్తాయని, తద్వారా పచ్చదనాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని, అనువైన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇప్ప చెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు.పర్యావరణ ప్రయోజనాలే కాకుండా, ఇప్ప చెట్ల వల్ల సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో లాభాలు ఉన్నాయని అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఇప్ప పువ్వులు, గింజలు గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజలకు ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉపయోగపడతాయని అన్నారు. సమృద్ధిగా పోషక విలువలు, ఔషధ గుణాలున్న ఇప్ప ఉత్పత్తులను ఆహారంగా, స్థానిక వైద్యంలో వినియోగిస్తారని, తద్వారా ప్రజల జీవనోపాధికి, ఆరోగ్య సంరక్షణకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఒక ఎమ్మెల్యేగా ప్రారంభించిన ఈ ఉద్యమానికి అనూహ్య మద్దతు లభిస్తుండటంతో ఇప్ప చెట్ల పెంపకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

## హత్య కేసులో 15 మందికి జీవిత ఖైదు

**కరీంనగర్,** ఒక వ్యక్తి హత్య కేసులో 15 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ తీర్పు వెలువరించారు. మరో నిందితుడు మైనర్ కావడంతో అతడిపై బాలనేరస్థుల న్యాయస్థానంలో విచారణకు అనుమతించింది. చేపలు పట్టే విషయంలో ఏడేళ్ల క్రితం జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది.కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన బొజ్జ తిరుపతి గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చెరువుల వివాదంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు అతడిని హత్య చేశారు. రాళ్లతో దాడి చేసి, కండువాను మెడకు బిగించి హతమార్చారు. ఈ ఘటన 2019 ఏప్రిల్ 19న జరిగింది. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం 15 మంది నిందితులకు జీవితఖైదుతో పాటు రూ.1,500 చొప్పున జరిమానా విధించింది

## ఎల్పీజీ కోసం ఆందోళనలు

**హైదరాబాద్** హైదరాబాద్ నగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్ర రూపం దాల్చింది. గ్యాస్ కోసం గంటల తరబడి ఎదురుచూసి విసిగిపోయిన ఆటో డ్రైవర్లు రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. సాగర్ రింగ్ రోడ్డు, ఎల్బీ నగర్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ వంటి పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు, ధర్నాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రెండు వారాలుగా ఈ సమస్య కొనసాగుతుండటంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరి, రాత్రంతా వేచి ఉన్నా గ్యాస్ దొరకడం లేదని వాపోతున్నారు. నిరసనలో భాగంగా కొందరు డ్రైవర్లు రాజేంద్రనగర్‌లో సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేయగా, బహదూర్‌పురాలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.రాష్ట్రంలో రోజుకు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా విదేశాల నుంచి గ్యాస్ దిగుమతులు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించి, సరఫరాను పెంచాలని చమురు సంస్థలను ఆదేశించారు.ఆందోళనల నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. నిరసన చేస్తున్న డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, గ్యాస్ కొరత సమస్య పరిష్కారం కాకపోవడంతో తమ ఆందోళనలు కొనసాగిస్తామని ఆటో డ్రైవర్ల సంఘాలు చెబుతున్నాయి.

## పాయకరావుపేటలో మంత్రి అనిత పర్యటన

**అనకాపల్లి జిల్లా** పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించార. నక్కపల్లిలో మంత్రికి మహిళలు ఘన స్వాగతం పలికారు. నక్కపల్లిలో ఇంటింటికి వెళ్లి మంత్రి పింఛనలు పంపిణీ చేసారు. నేతన్న జీవితాల్లో సరి కొత్త వెలుగులంటూ నక్కపల్లిలో కరపత్రాలతో ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు కరెంట్ ఉచితం అంటూ చేనేత కార్మికులు తెలిపారు. నక్కపల్లిలో చేనేత కార్మికులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు అడుగు తెలుసుకున్నారు. చేనేత కార్మికురాలతో కలిసి, మగ్గాన్ని నేసారు. చేనేత కార్మికురాలు వద్ద చీరను కొనుగోలు చేసారు. కరెంట్ బిల్లు భారాన్ని తగ్గించి, చేనేత కార్మికులకు ఆదాయం పెరిగేలా చేయడమే లక్ష్యమని మంత్రి అన్నారు. అప్పల పాయకరావుపేట గ్రామంలో కూడా పింఛన్లు పంపిణీ చేసారు. తరువాత బోదుగలం సమీపంలో గల ఆర్ అండ్ ఆర్ కాలనీలో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీఎం గారు.. ఆడవాళ్లే వంట చేయాలా...

**హైదరాబాద్,** హైదరాబాద్ కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సెకండియర్ విద్యార్థిని, నేషనల్ రైఫిల్ షూటర్ మహిమా కీర్తన సిరంగి.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం ఒక లేఖ రాసింది. అయితే కొన్ని రోజుల క్రితం నిర్వహించిన తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా అడిగిన ప్రశ్నపై.. మహిమా కీర్తన తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో వచ్చిన ఓ ప్రశ్న లింగ వివక్షను చూపించేలా ఉందంటూ ఆమె సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో వెల్లడించింది. వంట అంటే అమ్మాయిలు మాత్రమే చేయాలా అంటూ ప్రశ్నించింది.ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలోని ఇంగ్లీష్ క్వశ్చన్ పేపర్‌లో డైలాగ్ రైటింగ్‌కు రెండు ప్రశ్నలు అడిగారు. కుమార్తెకు వంట నేర్పాలనుకునే తల్లి.. కుమారుడి భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకోవాలనుకునే తండ్రికి సంబంధించిన ప్రశ్నలు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆడపిల్ల అయినంత మాత్రాన తల్లి తన కుమార్తెతో వంట గురించి చర్చించడం.. అబ్బాయి అనే కారణంతో కుమారుడు భవిష్యత్‌లో ఏం చేయాలని అనుకుంటున్నాడు అనే ప్రశ్న అడగడంపై మహిమ కీర్తన అభ్యంతరం వ్యక్తం చేశారు.అమ్మాయి అయితే వంట గురించి.. అబ్బాయి అయితే ఫ్యూచర్ ప్లాన్స్ గురించి అడుగుతారా అని ప్రశ్నించింది. ఈ క్రమంలోనే వంట అంటే అమ్మాయిలు మాత్రమే చేయాలా.. ప్రస్తుత ఆధునిక కాలంలో కూడా అమ్మాయిలను వంట గదులకే పరిమితం చేస్తారా అని నిలదీసింది. ఇలాంటి లింగ వివక్షతో కూడిన ప్రశ్నలను, పాఠాలను మార్చాలని మహిమ కీర్తన.. సీఎం రేవంత్ రెడ్డికి పంపించిన లేఖలో అడిగేసింది. ఈ క్రమంలోనే పాఠ్యాంశాల్లో ఉన్న లింగ వివక్షను ప్రశ్నిస్తూ.. ఇదే వ్యవహారంలో తన అభిప్రాయాన్ని కూడా వివరిస్తూ ఈ-మెయిల్ ద్వారా మహిమ కీర్తన సీఎంకు లెటర్ పంపించింది.తాను ఎదిగే క్రమంలో తన తల్లి, తండ్రి ఇద్దరూ వంట చేయడం చూశానని.. తనకు కూడా వంట చేయడం ఇష్టమని తెలిపింది. అదే సమయంలో తాను 2023లో జరిగిన అండర్ 19 రైఫిల్ షూటింగ్ పోటీల్లో.. తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛాంపియన్‌గా నిలిచినట్లు గుర్తు చేసింది. తాను నేషనల్ లెవల్ రైఫిల్ షూటర్‌ని అని తెలిపింది. మనం చదివే విద్యా వ్యవస్థ.. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే అని నేర్పించాలని పేర్కొంది. ఇలాంటి లింగ వివక్షకు సంబంధించిన ప్రశ్నలు పరీక్షలో రావడం చూసి తాను చాలా నిరుత్సాహపడినట్లు తెలిపింది. ఇప్పటికైనా ఇలాంటి పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తారని ఆశిస్తున్నట్లు మహిమ కీర్తన తెలిపింది.

### పింఛన్ పంపిణీ కార్యక్రమంలో

## పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మంచూరి



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం, పోరుమామిళ్ళ మండలం, పోరుమామిళ్ళ పంచాయతీ 5వ వార్డు ఉద్దికట్టలో నిర్వహించిన ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి జరుగుతోందని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా వారి ఇంటి వద్దకే సేవలు అందించడం కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు ఓబుళాపురం రాజశేఖర్, యువనాయకులు చెరుకూరి రవికుమార్, పోరుమామిళ్ళ మండల టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెరుకూరి చెంద్రాయుడు, మాజీ రంగసముద్రం సర్పంచ్ నడిపి వెంకట సుబ్బయ్యా,చిన్న వెంకటసుబ్బయ్య, చంద్రగిరి ప్రహ్లాద రెడ్డి, కల్లూరు దుగ్గిరెడ్డి, ,రహమతుల్లా మొగల్, అరవ శ్రీనివాసరెడ్డి, బిజి వేముల చంద్ర, మాచుపల్లి కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాళ్లపల్లి గిరి, గాజులపల్లి రవి,కోడూరు లక్ష్మీనారాయణ, రామయ్య, నరసయ్య, వెంకటసుబ్బయ్య, ప్రసాదు, గులాం గౌస్, పీరా, కమల్ భాష, చాంద్ బాషా, మొగల్ జిలాని, మొగల్ పెద్ద రసూల్,బజూ షరీఫ్, సుబ్బారాయుడు యాదవ్,తుపాకుల ప్రసాద్,గురుప్రసాద్ రెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి,మహేష్,ఉప్పత్తి సుబ్బారెడ్డి,అన్నడురు వెంకతసుబ్బారెడ్డి,కోటపాటి పెంచాలయ్యా,దేవినేని వెంకతసుబ్బారెడ్డి, క్రిష్ణ ,షేక్ రఫీ, నాయబ్,రఫీ, అన్నపురెడ్డి వెంకటసుబ్బయ్య, ఆఫీజ్, గాజుల వెంకటసుబ్బయ్య, బాలచంద్ర, పుల్లయ్య, నగిరి రమణయ్య, రాజేష్ , సాయికుమార్ , సుధాకర్, వలి,ధర్మవరపు సుబ్బయ్య, గోవిందాయపల్లి బాలు, చెన్నకేశవ నాయుడు, అనిల్,గోపాల్,సందీప్ పగిడి,కోనేటి కేశవ, ప్రభు, మొగల్ జిలాని,బొజ్జ చిన్నబాబు,చిన్నప్ప, కలవకూరి సురేంద్ర,పెద్దఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**రాయచోటి** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు .బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని చిన్నమండ మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వండాడి గ్రామం హరిజనవాడలో ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల ఒకటవ తేదీన అవ్వ తాతలకు వికలాంగులకు అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని స్వయంగా లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది మండల టిడిపి నాయకులతో కలిసి పెన్షన్ అందించారు..ఈ సందర్భంగా మంత్రి కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు..మండలంలోని బోరెడ్డిగారిపల్లి లో మంత్రి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజా దర్బార్ నిర్వహించిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా ప్రజల సమస్యలు,అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉండి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్శాలువ పుష్పగుచ్ఛములతో మంత్రి సత్కరించినారు..చిన్నమండెం మండలం, దేవగుడిపల్లి గ్రామం, కొండమూలలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన ఒ క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ...ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు మంత్రి బాణసంచాలు మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు.ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం తమకు ఆనందదాయకమని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని,ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డఅన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లి కు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.దాదాపు రూ.50 లక్షలు నిధులతో సిమెంట్ రోడ్డు, బిటి రోడ్డు ఏర్పాటుమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారికి వారి సోదరుడు లక్ష్మి ప్రసాద్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన పెద్దకోడివాండ్లపల్లి గ్రామ ప్రజలు. పాల్గొన్నారు.

### బకాయిలు చెల్లించాలన

## యూటిఎఫ్ నిరాహారదీక్షలు

**ఒంగోలు** యూటీఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఒంగోలు లోని జిల్లా యూటీఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్ష లు చేపట్టారు.ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని సి.పి.యఫ్ ని రద్దు పరచి పెన్షన్ ను అమలు చేయాలని దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా యూటీఫ్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సం. రాల అవుతున్న ఉద్యోగస్తులు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని సి.పి.యస్ రద్దు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు రద్దు చేయలేదని 30లక్షలు టీచర్స్ కు రావలసిన బకాయిలు చెల్లించలేదని తెలిపారు.వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని కోరారు.లేదంటే ఉద్యమం రాష్ట్ర స్థాయిలో మరింత ఉధృతం చేస్తామని చెప్పారు...

## వైకాపా బలోపేతానికి అందరూ కృషి చేయాలి

**ఒంగోలు** ప్రకాశం జిల్లాలో భారీ ఎత్తున జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చెయ్యాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారని అయన తెలిపారు. కరోనా టైమ్ లో కూడా రైతుల తో పాటు ప్రతి వర్గాన్ని జగన్ మోహన్ రెడ్డి ఆదుకున్నారు. మేము చేసింది చెప్పుకోలేకపోయాం. ప్రస్తుత అధికార పార్టీ మేము ప్రజలకు చేసిన కార్యక్రమాలను గుర్తు చేస్తుంది. జగన్ వెంట మేము ఉన్నాం అంటూ ప్రజల నిలబడుతుంటే మాకే ఆశ్చర్యం వేస్తుందని కారుమంచి అన్నారు. మరలా జగన్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకొంటున్నారు. అధికార పార్టీ ఆగడాలను అడ్డుకుంటూ కార్యకర్తలకు అండగా జిల్లా నాయకులు నిలబడుతున్నారు. అమరావతి కి జగన్ ఎప్పుడూ వ్యతిరేకం కాదు.గత ఐదు సంవత్సరాలలో అమరావతిలో శాస్వత భవనాల నిర్మాణం జరగలేదు ఇప్పుడు మీరు కట్టి చూపించండి. పి4 ద్వారా ఎంతమందికి న్యాయం జరిగిందో కూటమి ప్రభుత్వం చెప్పాలి. అసెంబ్లీ లో బయట. జగన్ నామస్మరణతో గడిపేస్తున్నారు. ప్రజలను పరిపాలనను గాలికొదిలేసి రెడ్ బుక్ పాలన తో రాష్ట్రం ని అల్లకల్లోమ్ చేస్తున్నది కూటమి. దళితులను రెచ్చకొట్టే ప్రయత్నం చేసాడు కాబట్టే రఘురామరాజు పై దళితులు దాడికి పాల్పడ్డారు. కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం కూటమి నేతలు మానుకోవాలని అయన అన్నారు. క్రిష్టియానిటి పై సుప్రీం కోర్టు నిర్ణయమే ఫైనల్ నిర్ణయమని అయన అన్నారు.

## ఎస్పీ కార్యాలయం వద్ద హైడ్రామా పై ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పై కేసు నమోదు చేయాలి

**పల్నాడు** ఎమ్మెల్యే అరవింద బాబు చేసిన వ్యవహారం రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. తన సిఫార్సులను పట్టించుకోవడం లేదన్న కారణంతో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు సుమారు 10 గంటల పాటు ఎస్పీ కార్యాలయంలో బైఠాయించడం, అధికారుల విధులకు ఆటంకం కలిగించడంపై వైసీపీ ఎద్దేవా చేసింది. రాజ్యాంగ వ్యవస్థలను అవమానిస్తున్నారని ల్లా వైఎస్ఆర్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గోపి రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనపై ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యే అరవింద్ బాబు ప్రవర్తన రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే ఆయనపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక మూలాల కోసమే ఈ గొడవ: జిల్లాలో గంజాయి, పేకాట వంటి అక్రమ దందాలను ఎస్పీ కఠినంగా అడ్డుకుంటున్నారు ఎమ్మెల్యేకు అందే 'వాటాలు' ఆగిపోవడంతోనే కావాలనే ఈ రకమైన బ్లాక్మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాత్రూమ్లో దాక్కోవడం చిన్న పిల్లలు లాగా వ్యవహరించారు. చర్చల కోసం వచ్చిన ఐజీ స్థాయి అధికారులకు కూడా సహకరించకుండా, బాత్రూమ్ డోర్లు వేసుకుని ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఒక అధికారిని కలవడానికి తలుపులు పగలగొట్టాల్సిన దుస్థితి రావడం దారుణమన్నారు. అర్హత లేని వ్యక్తులకు అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని ఆర్డీఓ పై ఒత్తిడి తేవడం, ఇప్పుడు ఎస్పీ ఆఫీసులో లీగల్ అడ్వైజర్ పోస్టు కోసం హల్చల్ చేయడం ఎమ్మెల్యే నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.

## సలేశ్వరం యాత్రకు పోటెత్తిన భక్తులు..

- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- సలేశ్వరం లింగమయ్య యాత్రకు పోటెత్తిన భక్తులు!
- మన్ననూర్ నుండి ఫర్హాబాద్ వరకు 4 కి.మీ మేర ట్రాఫిక్ జామ్.
- మూడు రోజుల సాహస యాత్ర నేడు ప్రారంభం

దట్టమైన నల్లమల అడవిలో కొలువై ఉన్న సలేశ్వరం లింగమయ్య సాహస యాత్ర ఈరోజు తెల్లవారుజామున అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఏడాదికి కేవలం మూడు రోజులు మాత్రమే అనుమతి ఉండే ఈ యాత్రకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు కాలి బాట పట్టడంతో అటవీ ప్రాంతం శివనామస్మరణతో మారుమోగిపోతుంది. ప్రకృతి ఒడిలో, జలపాతాల మధ్య వెలసిన మల్లికార్జునుడిని దర్శించుకోవడానికి భక్తులు ఎంతో ఉత్సాహంగా అడవి మార్గంలో ప్రయాణిస్తున్నారు.

**నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్** భక్తుల రద్దీ ఊహించని రీతిలో పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మన్ననూర్ నుండి ఫర్హాబాద్ చౌరస్తా వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ఇది పూర్తిగా ఘాట్ రోడ్డు కావడం, ఇరుకైన మలుపులు ఉండటంతో ట్రాఫిక్ క్లియర్ చేయడం అధికారులకు సవాలుగా మారింది. వందలాది వాహనాలు అడవి మార్గంలో నిలిచిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీ శాఖ, పోలీసు సిబ్బంది సమన్వయంతో ట్రాఫిక్కు క్రమబద్ధీకరించడానికి శ్రమిస్తున్నారు.

**సాహస యాత్ర.. అప్రమత్తంగా ఉండాలని సూచన** ప్రకృతి సిద్ధమైన లోయలు, కొండచరియల మధ్య సాగే ఈ యాత్ర అత్యంత సాహసోపేతమైనది కావడంతో అధికారులు భక్తులకు పలు సూచనలు చేస్తున్నారు. అడవిలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు, వన్యప్రాణులకు హాని కలగకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని కోరుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోయల వద్ద అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో భక్తులు సహనంతో వ్యవహరించి పోలీసులకు సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది.

## ఒంటిమిట్ట రాములోరి కళ్యాణానికి అంతా సిద్ధం

**కడప జిల్లా** ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణాన్ని పండు వెన్నెల్లో నిర్వహించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రామయ్య క్షేత్రం నుంచి జానకి రాముల పరిణయం జరిగే స్థలి వరకు దేదీప్యమానంగా వెలిగే విద్యుత్ దీపాలను అమర్చారు. రాములోరి కళ్యాణం జరిగే ప్రాంగణాన్ని రమణీయంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పెద్దలు, ప్రముఖులు, సామాన్య భక్తులకోసం 122 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్యాలరీలో సుమారు 500 మంది కూర్చునేలా... సుమారు 60 వేల మంది వీక్షించేలా ఏర్పాటు చేశారు..

సాయంత్రం 6:30 నుంచి 8:30 వరకు సీతారాముల కళ్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులతో పాటు మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, ప్రముఖులు, సామాన్య భక్తులు తరలి రానున్న నేపథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానం నిఘాతోపాటు.. సీసీ కెమెరాలు... డ్రోన్లతో చిత్రీకరణ నిర్వహించనున్నారు.. కళ్యాణానికి వచ్చే వాహనదారుల కోసం 18 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. కడప నుంచి తిరుపతికి వెళ్లే వాహనాలను రాయచోటి మీదుగా వెళ్లే విధంగా దారి మళ్ళించడం జరిగింది.

## తులం బంగారం ఎప్పుడు ఇస్తారు సార్...

### - చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రశ్నించిన లబ్ధిదారులు



**సికింద్రాబాద్** తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 82 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పంపిణీ చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రెండేళ్ళు దాటినా నేటి వరకు ఒక్కరికి కూడా తులం బంగారం ఇవ్వలేదు. తులం బంగారం కోసం లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు.

# అమరావతి అజేయం

- ఇకపై ఎవ్వరూ ఒక్క ఇంచు కూడా కదల్చలేరు మంత్రి నారాయణ
- చరిత్ర సృష్టించిన చంద్రబాబు కృషి..అమరావతికి లోక్‌సభ చట్టబద్ధత
- జూన్ 2 నుంచి ఏపీ రాజధానిగా అమరావతి.. మంత్రి నారాయణ సంచలన ప్రకటన
- రైతుల పోరాటానికి దక్కిన గౌరవం.. ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపిన మంత్రి నారాయణ
- అమరావతి క్లియర్.. ఆల్ రీజియన్స్ డెవలప్మెంట్.. రాష్ట్ర భవిష్యత్తుపై మంత్రి కీలక వ్యాఖ్యలు



నెల్లూరు (ప్రశ్న న్యూస్) అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలుపెరుగని కృషి, ప్రధాని మోదీ సహకారంతోనే ఇది సాధ్యమైందని, జూన్ 2, 2024 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అధికారికంగా అమలులోకి రాబోతుందని" స్పష్టం చేశారు. ఐదేళ్లుగా మొక్కవోని దీక్షతో పోరాడిన అమరావతి రైతులదే అసలైన విజయం అని కొనియాడిన ఆయన, ఇకపై రాజధానిని ఎవరూ ఒక్క ఇంచు కూడా కదల్చలేరని భరోసా ఇచ్చారు. అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ ఈ సందర్భంగా తెలిపారు.

## ఎల్బీనగర్ జోన్ లో విజిలెన్సు అధికారుల తనిఖీలు

**తనిఖీలు పేరుకే నా చర్యలు ఉంటాయా.?**

**తనిఖీలలో బయటపడ్డ అవినీతి అక్రమాలని బయట పెడతారా.? లేదా.?**



ఎల్బీనగర్(ప్రశ్న న్యూస్) విజిలెన్స్ అధికారుల దాడులు అంటేనే ఎవరు పట్టించుకోని పరిస్థితి నెలకొన్నది. ఎందుకంటే విజిలెన్స్ అధికారులు దాడులు చేసిన తర్వాత ఏం అక్రమాలు గుర్తించారు. ఎంత అవినీతి జరిగిందో ప్రజలకు మీడియాకు తెలపరు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోరు అన్న విమర్శలు ఉన్నాయి అందుకోసమే విజిలెన్స్ దాడులు అంటే పెద్దగా అధికారులే పట్టించుకోరు మరి ప్రజలు ఎలా పట్టించుకుంటారు.సరూర్నగర్, ఎల్బీనగర్, హయత్నగర్ సర్కిల్ కార్యాలయాలలో బుధవారం ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలోని సర్కిల్ కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు ఉన్నతాధికారులకు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఉదయం 11గంటల సమయంలో మూడు సర్కిళ్ల కార్యాలయంలో వెళ్లిన విజిలెన్స్ అధికారులు సాయంత్రం వరకు తనిఖీలు చేపట్టారు. అధికారులు ప్రధానంగా ఔట్సోర్సింగ్,కాంట్రాక్టు పద్దతిలో పని చేస్తున్న ఉద్యోగుల రిజిస్టర్లను, హాజరు పట్టికలను పరిశీలించడంతో పాటు ఎంత మంది ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు, వారు సమయానికి విధులకు హజరవుతున్నారా లేదా అనే వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం సర్కిల్ కార్యాలయలలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు ఇంక ఎంత మంది అవసరం ఉంటుందనే వివరాలను తీసుకున్నట్లు పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న పలువురు జిహెచ్ఎంసి అధికారులు ముందుగానే కార్యాలయాల నుంచి జారుకున్నట్లు కింది స్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు. విజిలెన్స్ అధికారులు – టౌన్ ప్లానింగ్, శానిటేషన్, పన్నుల విభాగం, ఇతర విభాగాలలో తనిఖీలు నిర్వహించి పలు రిజిస్టర్లను స్వాధీనం చేసుకోని రిజిస్టర్లలో సంతకాలు చేయని వారందరి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలు రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి అదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది. విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకుంటారా లేక సదా మామూల్లేనా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

## నెల్లూరు సిటీలో పెన్షన్ల పండుగ

**ఇంటింటికీ వెళ్లి అందచేసిన మంత్రి నారాయణ**

**ఆర్ధిక ఇబ్బందుల్లోనూ అండగా నిలిచిన సిఎం**

**క్రమం తప్పకుండా 4 వేల పెన్షన్**

**హర్షం వ్యక్తం చేస్తున్న అవ్వా ,తాతలు**

**మంగళహారతులతో మంత్రికి నీరాజనం పలికిన మహిళలు**

**అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు-మంత్రి నారాయణ**



నెల్లూరు (ప్రశ్న న్యూస్) ఆర్ధిక ఇబ్బందుల్లో సైతం అవ్వా ,తాతలకు ఇచ్చిన మాట తప్పని ప్రభుత్వం తమదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు .క్రమంతప్పకుండా ఇంటి ముంగిటికే పెన్షన్ డబ్బులు చేరుతుండటంతో లబ్ధిదారుల లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేవన్నారు .వారి ఆశీస్సులే తమ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని తెలిపారు.నెల్లూరు సిటీ లోని 5వ డివిజన్ అహ్మద్ నగర్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జన జాతరను తలపించింది. రాష్ట్ర మంత్రి నారాయణ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్ నగదును అందజేయడంతో అహ్మద్ నగర్ వీధులన్నీ పండగ వాతావరణంతో నిండిపోయాయి. మంత్రికి స్థానిక మహిళలు మంగళహారతులతో నీరాజనాలు పట్టి ఆత్మీయ స్వాగతం పలికారు. పూరిగుడిసెల్లో నివసించే నిరుపేదల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు .గత ప్రభుత్వం వేల కోట్ల అప్పులు పెట్టి వెళ్లినా, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఇచ్చిన మాట ప్రకారం 4,000 పెన్షన్ అందిస్తున్న ధీశాలి సీఎం చంద్రబాబు అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే రోజు 99 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసి ఏపీ రికార్డు సృష్టించిందన్నారు .అభివృద్ధి-సంక్షేమమే రెండు కళ్లుగా ముందుకు సాగుతామన్నారు. 50 కోట్లతో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం, 50 వేల మొక్కలతో నెల్లూరును 'గ్రీన్ సిటీ'గా మార్చడమే తన లక్ష్యమని చెప్పారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మంత్రి నారాయణ దాతృత్వం, క్రమశిక్షణ నెల్లూరు అభివృద్ధికి వెన్నెముకని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్ ,మేయర్ సుజాతా అశోక్ ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ .డివిజన్ క్లస్టర్ శశి కుమార్ ,ప్రెసిడెంట్ గంగాధర్ ,యూనిట్ ఇంచార్జిలు హబీబ్ ,శారద ,టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు ,టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు .

# ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే మూల్యం చెల్లించక తప్పదు

**-పిఆర్సీ అమలులో జాప్యాన్ని ఒప్పుకోం.**

**-రిలే దీక్షలలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జాబీర్ హెచ్చరిక**



**బద్వేలు** ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జాబీర్ హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం కడప కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.జాబీర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు అయిందని, అయినప్పటికీ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. పిఆర్సీ అమలుకు నోచుకోకపోవడం వల్ల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారం చేపట్టిన ఆరు మాసాలలోగా చెల్లిస్తామన్న ఆర్థిక బకాయిలు, రెండేళ్లయినా పూర్తి చెల్లింపులకు నోచుకోలేదన్నారు. కేవలం 9,500 కోట్ల బకాయిలు మాత్రమే చెల్లించి, ఉద్యోగుల బకాయిలన్నింటిని చెల్లించినట్లు సాక్షాత్తు అసెంబ్లీలోనే ప్రకటన చేయడం ఉద్యోగులను వంచించడమేనన్నారు. ఇంకా 30 వేల కోట్ల పైబడిన బకాయిలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఉద్యమాలు చేపడుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు, అవసరమైతే సెక్రటేరియట్ ముట్టడి చేపడతామని ఆయన హెచ్చరించారు.ఏపీ జెఏసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొద్ది మేరకు ఆర్థిక బకాయిల్ని చెల్లించినప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు చేపట్టకపోవడం తగదన్నారు. ఆర్థిక బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించి నిర్ణీత గడువులోగా బకాయిలను చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేయడం తగదన్నారు. సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే పోరాటమే శరణ్యం అన్నారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికారపక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉద్యోగ ,ఉపాధ్యాయుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చిన కూటమి పెద్దలు గద్దెనెక్కగానే ఉద్యోగుల సమస్యలను విస్మరించడం ఏంటని ప్రశ్నించారు. సకాలంలో డిఏలు చెల్లించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో ప్రశ్నించిన కూటమి పెద్దలు నేడు మూడు డిఏ లను పెండింగ్లో ఉంచడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న కూటమి నేతలు ఆ వైపుగా ఒక్క అడుగు కూడా వేయకపోవడం దుర్మార్గమన్నారు. కరోనా మహమ్మరితో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఉన్న వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకాయిలు చెల్లింపులు లేవన్నారు. ప్రభుత్వం జారీచేసిన హెల్త్ కార్డులు చెల్లని రూకలా ఉన్నాయన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం

**– నేడు హనుమాన్ జన్మోత్సవం**

**– అందరికీ హనుమాన్ జన్మోత్సవ శుభాకాంక్షలు**



హనుమంతుని జయంతిని చైత్ర శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకుంటారు. ఈ రోజున హనుమాన్ భక్తులు రోజంతా ఉపవాసముండి, హనుమన్ చాలిసా పఠనం, రామనామ జపం చేస్తారు. హనుమంతుని జన్మవృత్తాంతం శివమహాపురాణం, రామాయణం, పరాశిర సంహిత మొదలైన గ్రంథాలలో అనేకానేక గాధలతో వివరించబడి వుంది .హిందూ పురాణ కథల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను. కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్ళాడెను. వారు సంతానము కొరకు భక్తితో శివుని ఆరాధించిరి. అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండు రూపములో అంజనకొసగెను. అంజనకు జన్మించిన సుతుడే ఆంజనేయుడు. కేసరి నందనుడనీ, వాయుదేవుని అనుగ్రహముతో జన్మించినందున వాయుసుతుడనీ కూడా అంటారు.ఈ పండుగ ద్వైత సంప్రదాయము ననుసరించి మాధ్యులకు ప్రధానమైనది. వారు హనుమంతుని 'ముఖ్య ప్రాణ దేవరు' అని పిలుస్తారు. హనుమంతుని ఉపాసకులు కూడా ఈ పండుగ జరుపుకుంటారు. శ్రీరామనవమితో పాటు కొందరు ఈ జయంతి జరుపుటను కూడా ఉంది.పరాశర సంహిత అనే గ్రంథం ప్రకారం ఆంజనేయుడు వైశాఖ బహుళ దశమి, శనివారం జన్మించారని తెలిపారు. అదే రోజున కొంతమంది హనుమజ్జయంతి జరుపుకుంటారు అయితే కొన్ని ఐతిహ్యాల ప్రకారం చైత్ర పౌర్ణమి నాడు నికుంభుడు తదిరత రాక్షసులను సంహరించి హనుమంతుడు విజయం సాధించినట్లు కనిపిస్తుంది. ఈ కారణంగా ఆ రోజు హనుమద్ విజయోత్సవం చేసుకునే సంప్రదాయం కొన్ని చోట్ల ఉంది. దీన్ని ఉత్తరాదిలో హనుమజ్జయంతిగా చేసుకుంటారుజన్మ వృత్తాంతము:ఒకసారి దేవలోకమందు దేవేంద్రుడు కొలువుతీరి యున్న సమయాన పుంజికస్థల అను అప్సరసకాంత బృహస్పతి వద్దకు చేరి హాస్య ప్రసంగము చేయసాగిందట, ఆమె యొక్క హావభావ వికారాలకు బృహస్పతి మిక్కిలి ఆగ్రహించి నీవు భూలోకమందు "వానరస్త్రీ" గా జన్మింతువుగాక! అని శాపము పెట్టినాడు. అంత ఆ పుంజికస్థల తన తప్పిదాన్ని మన్నించి శాపవిమొచనమీయమని పరిపరి విధముల ప్రార్థించింది. దానికి బృహస్పతి సంతసించి నీవు భూలోకమందు "హనుమంతునికి" జన్మ ఇచ్చిన తరువాత తిరిగి దేవలోకమునకు రాగలవని అనుగ్రహించెను. ఇది కంబరామాయణ గాథలో గల వృత్తాంతము. ఆ శాపకారణంగా "పుంజికస్థల" భూలోకమందు వానరకన్యగా జన్మించి "కేసరి" అను అందమైన వానరాన్ని ప్రేమించి వివాహమాడింది. అంత ఆమె గర్భముదాల్చి శివాంశ సంభూతుడైన "శ్రీ ఆంజనేయస్వామి" కి జన్మ ఇచ్చింది.మనోజవం మారుతతుల్య వేగం జితేంద్రియంబుద్ధిమతాంవరిష్టం।వాతాత్మజం వానరయూథ ముఖ్యంశ్రీరామ దూతం శరణం ప్రపద్యే॥భావము:- మనస్సుని జయించినవాడు, గాలి వేగంతో పయనించేవాడు, పంచేంద్రియాలను తన అధీనంలో ఉంచుకున్నవాడు,గొప్ప తెలివిగలిగినవాడు, వానరులలో ముఖ్యుడు, శ్రీ రామచంద్రునకు దూత అయిన హనుమంతునికి ప్రణామం చేస్తున్నాను.ఆంజనేయస్వామికి 41 రోజులు నియమంగా ఆరాధన చేయాలి. గుడి దగ్గర ఉన్న రావి చెట్టుకు "11" ప్రదక్షిణలు నిదానంగా తిరుగుతూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అంటూ స్మరించుకోవాలి. స్త్రీలు మధ్యలో విరామం ఇచ్చి తిరిగి ప్రారంభించి 41 రోజులు పూర్తి చేయవచ్చు. ప్రమిద భూమిపై పెట్టకుండా రావి ఆకు వేసి దానిపై పిండితో తయారు చేసిన దీపాన్నిపెట్టి కుంకుమ, పూలతో అలంకరించి వెలిగించాలి. ఇందులో సూచించినట్లుగా పిండితో చేసిన ప్రమిదలో కొంచం బెల్లం వేసి దానిపై వత్తి వేసి నునే పోసి పూజ చేయాల్సి ఉంటుంది.

## మూతపడ్డ చికెన్ దుకాణాలు

**సికింద్రాబాద్..** సికింద్రాబాద్లోని పలు ప్రాంతాలలో చికెన్ దుకాణాలను మూసివేశారు.చికెన్ విక్రయదారులు బంద్ చేపట్టడంతో సికింద్రాబాద్ వ్యాప్తంగా మాంసం ?కాణాలు మూతపడ్డాయి. కంపెనీలు కమిషన్లు భారీగా తగ్గించడాన్ని నిరసిస్తూ తెలంగాణ చికెన్ సెంటర్ల అసోసియేషన్ ఈ బంద్కు పిలుపునిచ్చింది. అయితే వ్యాపారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ పిలుపుతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చికెన్ షాపులు మూతపడ్డాయి.

## ఆర్ బీ కే కేంద్రంలో తాగుబోతుల హల్చల్

**– మహిళ ఉద్యోగిపై దాడికి యత్నం**




**కౌతాళం** కౌతాళం లోని షాది ఖానాలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) తాగుబోతుల అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నట్లు సమాచారం.ఆర్ బీ కే సహాయకురాలు మౌనిక రెడ్డి పై ఓ తాగుబోతు దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది.ఈ విషయాన్ని ఆమె కూటమి నాయకులు వెంకటపతి రాజుకు తెలియజేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వెంకటపతి రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయంలోనే మహిళలకు భద్రత లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆర్‌బీకే కేంద్రం తాగుబోతుల నిలయంగా మారడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. వెంటనే పోలీసులు స్పందించి మహిళా ఉద్యోగికి భద్రత కల్పించడంతో పాటు, దాడికి యత్నించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు రాజనందు, మండల ఉపాధ్యక్షుడు కురువ వీరేష్, గిరి, ముకన్న తదితరులు పాల్గొన్నారు.

## అమరజ్యోతి భవనంలో వైర్లను ఎలుకలు కొరుకుతున్నాయి

**హైదరాబాద్** తెలంగాణ సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరజ్యోతి భవనాలకు మూడేళ్లుగా మెయింటైనెన్స్ నిధులు కేటాయించడంలేదని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టించాడు కాబట్టి నిధులు ఇవ్వకుండా అది చెడిపోతే ఆయనను బద్నాం చేయాలనే కుట్ర చేస్తున్నారు. అమరజ్యోతి భవనంలో వైర్లను ఎలుకలు కొరుకుతున్నాయి. అంబేద్కర్ విగ్రహం వద్ద గేటుకు తాళం వేసి ఉంచారు. నాకు తెలిసి సొంత ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని చూసే ఏకైక ప్రభుజ్వం ప్రపంచంలో ఇదొకటే నని అయన అన్నారు.

## మరుసటి రోజు నిశ్చితార్థం..యువకుడి మృతి

**ఖమ్మం** రేపు నిశ్చితార్థం వుంది. ఒక రోజు ముందు రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద రోడ్డు దాటుతున్న ప్రసాద్(28) అనే యువకుడిని, కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రసాద్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జర్నలిస్టులకు మెగా హెల్త్ చెకప్ క్యాంప్

**– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు,** జిల్లాలోని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అపోలో సహకారంతో జిల్లా అడ్మినిస్ట్రేషన్, ఐ అండ్ పిఆర్ విభాగం ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిహెచ్‌హెచ్)లో ఈ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జర్నలిస్టులు తమ వృత్తి ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ది అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్), జిల్లా ప్రధాన ఆసుపత్రి (జిహెచ్‌హెచ్) అధికారులు వైద్య శిబిరానికి పగడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, చర్మవ్యాధులు, చెవి-ముక్కు-గొంతు, కంటి వైద్య విభాగాల్లో నిపుణుల వైద్య సేవలు అందిస్తారు. మహిళల కోసం గైనకాలజీ పరీక్షలు, పిల్లల కోసం పీడియాట్రిక్ పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. అదనంగా కంప్లీట్ బ్లడ్ కౌంట్, మూత్ర పరీక్ష, రక్తంలో చక్కెర పరీక్షలు, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్టులు, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహిస్తారు. అవసరాన్ని బట్టి ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహిస్తారు. మహిళల కోసం మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయి. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి. కోరారు.

# ఏసీబీ వలలో చిక్కిన ఏఎస్ఐ

**- 15వేల రూపాయలు డిమాండ్**

**- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బాలయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు.కాంప్రమైజ్ అయిన మహిళా వేధింపుల కేసును రంగారెడ్డి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించడానికి రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు.చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం. 363/2025లో పల్లపు రాంబాబు పై మహిళా వేధింపుల కేసు నమోదు చేశారు.ఈ కేసు కాంప్రమైజ్ అయిన అనంతరం దాన్ని లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించడానికి ఏఎస్సై బాలయ్య లంచం డిమాండ్ చేశారు. బాధితుడు పల్లపు రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా అధికారులు ముందస్తుగా ట్రాప్ ఏర్పాటు చేసి కోర్టు ప్రాంగణంలోనే బాలయ్య లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# మెట్‌పల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం




మెట్‌పల్లి (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేసింది. ఇటీవల ఈ నెల 30న నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన కార్యవర్గానికి ఎన్నికల అధికారులు జిల్లా వెంకటేశ్వర్లు, ఏలేటి శ్రీనివాస్ రెడ్డి,పుప్పాల భానుమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్లా రాజేందర్ ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ, బార్ అసోసియేషన్ అభివృద్ధితో పాటు న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం పూర్వ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి బార్ అసోసియేషన్‌కు సంబంధించిన రికార్డులను నూతన అధ్యక్షుడికి అప్పగించారు. కార్యక్రమం అనంతరం రాంరెడ్డి,ఎన్నికల అధికారులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్ మహ్మద్,కొండా ప్రవీణ్ కుమార్, ఏలేటి నరేందర్ రెడ్డి, పుప్పాల రాంభూపాల్, పోలకొండ దయాకర్ వర్మ, బద్దం లక్ష్మారెడ్డి, గడ్డం శంకర్ రెడ్డి, బోడ లక్ష్మణ్, అలాల సత్యనారాయణ, పసునూరి శ్రీనివాస్, పడిగేల శ్రీనివాస్, రాంపల్లి జగన్, ఉడుత ప్రశాంత్ మహర్షి, బిగుల్లా శంకర్, మార్క వంశీకృష్ణ, ద్యావని సత్యనారాయణ, వెల్మల స్వప్న రావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు

**- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ సంక్షేమం,దివ్యాంగులు, వృద్ధులు,ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించి, మరింత కాలం ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ఆకాంక్షించారు.

# ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యవంతమైన సమాజం

**- జాతీయ ఉత్తమ ఆర్గానిక్ రైతు : చిన్ని కృష్ణయ్య**

**- జాగిర్యాల్ గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం,జాగిర్యాల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్గానిక్ వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఆర్గానిక్ రైతు చిన్ని కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలోని రైతులు, విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా ఆయన ఆర్గానిక్ పంటల వల్ల కలిగే లాభాలు, వాటి వినియోగంతో ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, మన ఆరోగ్యానికి కలిగే అనర్థాలను కొన్ని ప్రయోగాల ద్వారా వివరించి అందరికీ అవగాహన కల్పించారు.భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే రసాయన రహిత ఆర్గానిక్ పంటలను ఎక్కువగా సాగు చేయాలని, వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని సూచించారు. రైతులు మంచి నాణ్యమైన వడ్లను పండించుకోవాలని కూడా ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో రైతులు, వి.డి.సి సభ్యులు,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాటా సవాల్ పసుపు బట్టలతో ప్రమాణం చేస్తా

**- ఎమ్మెల్యే గూడెం, మాజీ మంత్రి హరీష్ రావులపై కాటా శ్రీనివాస్ గౌడ్ ఘాటు విమర్శలు**

పటాన్‌చెరు( ప్రశ్న న్యూస్) పటాన్ చెరు నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ నిర్వహించిన మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.మీడియాతో మాట్లాడుతూ కాటా శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన స్థాయి గురించి మాట్లాడటాన్ని ప్రశ్నించారు. “స్థాయి గురించి మాట్లాడటం అంటే ఏ స్థాయి కావాలి?” అని ప్రశ్నిస్తూ, హరీశ్ రావు రాసిన స్క్రిప్ట్ ప్రకారమే వారు మాట్లాడుతున్నారని ఆరోపించారు.తమ కుటుంబం రాజకీయ చరిత్రాత్మక నేపథ్యం కలిగిందని, పేదలకు అండగా నిలిచిన కుటుంబమని పేర్కొన్నారు. తమ కుటుంబ పేరుతో పలు కాలనీలు ఉన్నాయని, అలాంటి కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరైంది కాదని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తమ కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయని కూడా తెలిపారు.భూకబ్జాలు, అక్రమ ఆస్తులపై ఎమ్మెల్యే పై ఆరోపణలు చేస్తూ, పలు సర్వే నంబర్లను ఉదహరించారు. 62, 64, 65, 453, ఇంద్రేశం ప్రాంతంలోని 178 సర్వే నంబర్లలో అక్రమ రియల్ దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నారనే పేరుతో వందల కోట్లు అక్రమంగా సంపాదించారని విమర్శించారు.రెండు లక్షల జీతం ఉన్నవారు అంతటి ఆస్తులు సంపాదించలేకపోతే, మీకు ఈ సంపాదన ఎలా వచ్చింది?” అంటూ ప్రశ్నించారు. ఈడీ అటాచ్ చేసిన పత్రాలను కూడా బహిరంగం చేస్తామని తెలిపారు.తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, అవసరమైతే శివాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమని ప్రకటించారు. “రేపు బీరంగూడలో ఉదయం 11 గంటలకు శివాలయంలో పసుపు బట్టలతో ప్రమాణం చేద్దాం. నిజం ఎవరిదో దేవుడే నిర్ణయిస్తాడు”



అని సవాల్ విసిరారు.ఇద్దరి ఆస్తులను బహిర్గతం చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయని, గత రెండు సంవత్సరాల్లో జరిగిన అవినీతి వ్యవహారాలను బయటపెడతానని హెచ్చరించారు. ఎమ్మెల్యే మూడు సార్లు గెలిచినా రాజకీయ అవగాహన లేదని విమర్శించారు. ఇకపై కూడా అవినీతి, అక్రమాలపై పోరాటం కొనసాగిస్తానని కాటా శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు ఆమోదించినందుకు

# ధన్యవాదాలు: కొండ్రోన్ పల్లి గిరిబాబు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు**

**ఎన్నో సంవత్సరాల న్యాయవాదుల పోరాటం ఫలించింది**

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) నిరంతరం న్యాయవాదులపై దాడులు హత్యలు జరుగుతున్న కోర్టులో కేసులు వేస్తున్న తప్పించుకుని తిరిగే బడా బాబులకు న్యాయవాదుల కు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎన్నో సంవత్సరాలుగా న్యాయవాదులు పోరాడుతుంటే అసెంబ్లీలో న్యాయవాదుల చట్టం బిల్లును ఆమోదించడం ఎంతో సంతోషమని హైకోర్టు న్యాయవాది కొండ్రోన్ పల్లి గిరిబాబు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో రోజులుగా న్యాయవాదుల పైన విచక్షణ రహితంగా దాడులు జరుగుతున్నాయి, తెలంగాణలో హత్యకు గురైన ప్రముఖ న్యాయవాదులు గట్టు వామన్‌రావు, పి.వి. నాగమణి (2021) మంథని-పెద్దపల్లి హైవేపై పట్టపగలు దారుణ హత్యకు గురయ్యారు. వామన్‌రావు దంపతులు పిఐఎల్‌లు వేయడం వల్ల ఈ హత్య జరిగినట్లు వార్తలు వచ్చాయి, ఈ కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు సిబిఐ (జదీ×) కి అప్పగించింది.జి. స్వప్న కుమారి (2026) చేవెళ్ల పరిధిలో భూ వివాదం కారణంగా న్యాయవాది స్వప్న కుమారి హత్యకు గురయ్యారు. ఈ ఘటన పై మానవ హక్కుల కమిషన్ డీజీపీని నివేదిక కోరింది.హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్ (2025) ఎల్బీనగర్ సమీపంలో అలాగే అత్తాపూర్ సమీపంలో ఆఫీసులోనే ఒక న్యాయవాది పదునైన ఆయుధాలతో హత్యకు గురయ్యారు. 2026 ఇలా చెప్పుకుంటూ పోతే అనేక న్యాయవాదుల పైన నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయి, న్యాయవాదుల రక్షణ చట్టం కోసం ఎన్నో పోరాటాలు చేసాము,ఆ పోరాటాల ఫలితం ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు అసెంబ్లీలో ఆమోదించడం ఆ బిల్లు గవర్నర్ సంతకం కోసం ఉండడం హర్షనీయం. ఈ సందర్భంగా కొండ్రోన్ పల్లి గిరిబాబు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ కేటాయించాలని మరియు 2019 ఎన్రోల్మెంట్ చేసుకునే న్యాయవాదులు ఆరోగ్య భద్రత కార్డులు




అమలు చేయాలని, న్యాయవాదులకు అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

# బీరప్ప స్వామి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**- భారతీయ జనతా పార్టీ నేతలు**

**- శాత్రాజుపల్లిలో బీరప్ప పట్నాల వేడుకలో భాజపా నేతల హాజరు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో గొల్ల కురుమ కులస్తుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బీరప్ప పట్నాలలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపి,వేములవాడ పట్టణ భాజపా అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే బీరప్ప పట్నాలను ఎంతో అద్భుతంగా నిర్వహిస్తున్న గొల్ల కురుమ కులస్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కుల దైవం బీరప్ప స్వామి ఆశీస్సులతో పాడిపంటలు బాగా పండాలని, వర్షాలు సకాలంలో కురవాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు మేకల చిన్నయ్య, శ్రీనివాస్, రఘుపతి,నాయకులు గుడిసె మనోజ్, వినోద్, మహేందర్‌తో పాటు బీజేపీ నాయకులు పిన్నింటి హనుమాండ్లు, మహంకాళి శ్రీను, రేగుల రాజకుమార్, జవ్వాజి రాజశేఖర్, బిల్లా కృష్ణ, యశ్వంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి



కీసర (ప్రశ్న న్యూస్) కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కొడ్ లను లను రద్దు చేయాలి, నూతన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలీ. సిఐటియు . ఏప్రిల్ 1 బ్లాక్ డే సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో రాస్తారోకో ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత కార్మిక చట్టాన్ని పునరుద్ధరించాలి, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలి, కనీస వేతనాన్ని అమలు చేసే కార్మికులందరికీ ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. నాలుగు లేబర్ కొడ్ లను అమలు చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ ఏప్రిల్ ఒకటి బ్లాక్ డే గా పాటిస్తూ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో బోగారం, రాంపల్లి, దాయరా, జన్నారం కాలనీ మరియు రాంపల్లి- బోగారం పారిశ్రామిక ప్రాంతంలో రాస్తారోకో, నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు కీసర మండల నాయకులు చింతకండి అశోక్ మరియు సిలువేరి సుదర్శన్ గంగాధరి కనకయ్య , ఎండి బషీర్, నమూరుగోముల చంద్రయ్య , ఇగురం సత్తయ్య , ఇగురం తార, గాజుల సురేష్ , పసుపులేటి నితిన్ , గోకుల అంజలి, గాజుల నిర్మల, పసికంటి చందర్, వెంకటేష్ , భాగ్య, పోచయ్య, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**- ఓపీ, ఐపీ కేసులు రోజూవారి సేవలపై ప్రత్యేక దృష్టి**

**- విద్యార్థినులకు పోషకాహారం అందించాలి - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ ( ప్రశ్న న్యూస్) జనగామ జిల్లాలోని జఫర్గడ్ మండల పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోజూవారిగా వస్తున్న ఓపీ (ఔట్ పేషెంట్), ఐపీ (ఇన్ పేషెంట్) కేసుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రసవాల కేసులు, గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో చర్చించారు. ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు.డెంటల్ విభాగం, స్కానింగ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించారు. ఔషదాల నిల్వలను పరిశీలించి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. డయాలసిస్ తీసుకుంటున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవల గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్య కేంద్రాల పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ, నిల్వ విధానాలను తనిఖీ చేసి, సరైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ క్రమంలో మౌలిక వసతులు మెరుపరచాలని, వైద్యులు, సిబ్బంది సమయానుగుణంగా అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం జఫర్గడ్ మండలంలోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించి, వంటశాలను తనిఖీ చేశారు.వంటకు ఉపయోగించే సామాన్లు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం పరిశుభ్రంగా ఉండాలని, పోషకాహారం అందించాలని సూచించారు.



పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్ వినియోగాన్ని కూడా పర్యవేక్షించారు.పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడి, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీకి వచ్చేస్తున్న 'వధ్ 2'



సంజయ్ మిశ్రా – నీనా గుప్తా ప్రధానమైన పాత్రలను పోషించిన 'వధ్' సినిమాకి గతంలో మంచి ఆదరణ లభించింది. 2022లో వచ్చిన ఆ సినిమాకి సీక్వెల్ ఎప్పుడు వస్తుందా అనే ఆసక్తితో ఎదురుచూస్తున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అలాంటి వారి కుతూహలానికి తెరదించుతూ, 'వధ్ 2' థియేటర్లకు వచ్చింది. జస్పాల్ సింగ్ సంధూ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 3వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. సంజయ్ మిశ్రా .. నీనా గుప్తా ప్రధానమైన పాత్రలను పోషించగా, ఇతర ముఖ్యమైన పాత్రలలో అక్షయ్ డోగ్రా .. అమిత్ కె సింగ్ .. కుముద్ మిశ్రా తదితరులు కనిపించనున్నారు. మొదటి భాగానికి ఏ మాత్రం తగ్గకుండా సీక్వెల్ ఉందనే టాక్, థియేటర్ల దగ్గర బలంగా వినిపించింది. శంభునాథ మిశ్రా పోలీస్ ఆఫీసర్ గా ఉంటాడు. అక్కడి జైల్లో మంజు జీవితఖైదుగా ఉంటుంది.

ఇటు పోలీస్ ఆఫీసర్ కీ .. అటు ఖైదీకి మధ్య సాన్నిహిత్యం పెరుగుతూ వెళుతుంది. అది ఇద్దరి మధ్య బలమైన బంధానికి కారణమవుతుంది. జైల్లోనే వాళ్లు రహస్యంగా కలుస్తుంటారు. రాజకీయనాయకుడు సోదరుడైన కేశవ్ కూడా అదే జైల్లో శిక్షను అనుభవిస్తూ ఉంటాడు. అతని ద్వారా అక్కడ చోటుచేసుకునే సంఘటనకు ఎలాంటివి? అనేది కథ.

# ఊహకు అందని మాయాజాలం



సీనియర్ కథానాయిక అనుష్కశెట్టి మలయాళంలో నటిస్తున్న తొలి చిత్రం 'కథనార్'. డార్క్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి రొజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. గోకులం గోపాలన్ నిర్మాత. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆద్యంతం ఫాంటసీ అంశాలతో విజువల్ ఎఫెక్ట్స్‌ను హైలైట్ చేస్తూ ట్రైలర్ ఆకట్టుకుంది. అతీంద్రియ శక్తులు ఉన్నాయని నమ్మే కడమట్టత్తు కథనార్ అనే పూజారి గాథల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పురాణాలు, మాయా ప్రపంచం కలబోతగా ఓ ఫాంటసీ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ సాగింది. 'ఎవరి ఊహకి అందని.. అందరూ ఆశ్చర్యంతో చూసే ఓ మాయాజాలం' అనే డైలాగ్ సినిమా కథా సారాన్ని తెలియజేసేలా ఉంది. జయసూర్య, ప్రభుదేవా, సనూప్‌సాన్, శాండీ, దేవిక, నితీష్ భరద్వాజ్, వినీత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాహుల్ సుబ్రహ్మణ్యన్, దర్శకత్వం: రోజిన్ థామస్.

# మళ్లీ రాణిగా రాబోతున్న కంగనా..

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన చిత్రం 'క్వీన్'. వికాస్ బల్ దర్శకత్వంలో 2013లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా కంగనాకు నేషనల్ అవార్డును తెచ్చిపెట్టింది. ఒక సాధారణ అమ్మాయి తన పెళ్లి రద్దయ్యాక ఒంటరిగా హనీమూన్‌కు వెళ్లి, అక్కడ తనను తాను ఎలా ఆవిష్కరించుకుంది అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. అయితే తాజాగా ఈ సూపర్ హిట్ చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు బాలీవుడ్ మీడియా వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి. తాజాగా రాబోతున్న ఈ సీక్వెల్‌లో కంగనా రనౌత్ మరోసారి 'రాణి' పాత్రలో అలరించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. మొదటి భాగంలో రాణి ప్యారిస్, ఆమ్‌స్టర్‌డ్యామ్ వంటి యూరప్ నగరాల్లో పర్యటిస్తే, ఈ 'క్వీన్ 2' చిత్రంలో ఆమె ప్రయాణం మన దేశంలోని వివిధ మెట్రో నగరాల చుట్టూ సాగనుందని బాలీవుడ్ మీడియా వర్గాల సమాచారం. మొదటి భాగాన్ని అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు వికాస్ బహ్ల్ ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించబోతున్నారు. ఈ సినిమాలో కంగనా మినహా పాత నటీనటులు ఎవరూ ఉండరని, ఎక్కువ శాతం కొత్త థియేటర్ ఆర్టిస్టులను ఎంపిక చేసుకుంటున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న కంగనా ఈ సినిమా షూటింగ్ కోసం ప్రత్యేకంగా డేట్స్ కేటాయించినట్లు సమాచారం. ముంబైలో వేసిన ప్రత్యేక సెట్‌లో ఏప్రిల్ నెలాఖరు నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని, దాదాపు మూడు నెలల్లోనే ఈ సినిమాను పూర్తి చేసేలా చిత్ర యూనిట్ ప్రణాళికలు సిద్ధం చేయబోతున్నట్లు టాక్.



# 'రాజా శివాజీ'

## – టీజర్ విడుదల!



మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా రాబోతున్న తాజా చిత్రం 'రాజా శివాజీ' బాలీవుడ్ నటుడు, దర్శకుడు రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రను పోషిస్తూ, ఈ చిత్రానికి దర్శకత్వం కూడా వహిస్తుండగా.. రితేష్ భార్య, ప్రముఖ నటి జెనీలియా దేశ్‌ముఖ్ (ముంబై ఫిల్మ్ కంపెనీ), జియో స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం 2026 మే 1న (మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. మరాఠీ, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ మరియు మలయాళ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కాబోతున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.మరాఠా ప్రజల స్వరాజ్యం కోసం శివాజీ మహారాజ్ చేసిన పోరాటాన్ని, నాటి ఉద్రిక్త పరిస్థితులను టీజర్‌లో చాలా అద్భుతంగా చూపించారు. ఇక సంజయ్ దత్ వాయిస్‌తో వచ్చే 'మరాఠాల తలరాతలో చావు రాసి ఉందా.. లేదా బానిసత్వమా?' అంటూ సాగే డైలాగ్‌కు.. రితేష్ దేశ్‌ముఖ్ 'స్వరాజ్యం' అంటూ సమాధానమిచ్చే సీన్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచింది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్ విజువల్స్ ఈ సినిమాకు అందిస్తుండగా, అజయ్–అతుల్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్రంలో సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, విద్యాబాలన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నాడు.

# జనం మనసులో నిలిచే సినిమా



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న భావోద్వేగ ప్రేమకథ 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి ఈ చిత్రానికి దర్శకుడు. బ్లాక్‌బస్టర్ 'బేబీ' మేకర్స్ సాయిరాజేష్, ఎస్‌కేఎన్ నిర్మాతలు. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో 'గుర్తుందా..' అంటూ సాగే ఓ పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'సాయిరాజేష్ ఈ కథ చెప్పినప్పుడే ఇది బలంగా జనం మనసుల్లో నిలిచిపోయే సినిమా అని అర్థమైంది. ముఖ్యంగా మణిశర్మ ఇచ్చిన ఏడు పాటల్నీ థియేటర్లలో సెలబ్రేట్ చేసుకుంటారు' అని నమ్మకంగా చెప్పారు. ఏదో చిన్న సినిమా చేసుకుందాం అనుకున్న తనతో ఇంతటి ఎమోషనల్ మూవీని డైరెక్ట్ చేయించిన నిర్మాతలు సాయిరాజేష్, ఎస్‌కేఎన్‌లకు కృతజ్ఞతలని దర్శకుడు రవి నంబూరి అన్నారు. తన కథను తాను అనుకున్న దానికంటే అద్భుతంగా దర్శకుడు రవి నంబూరి తెరకెక్కించాడని, తను ఎంతటి ప్రతిభావంతుడో ఈ సినిమా చెప్పబోతోందని కథారచయిత, నిర్మాత సాయిరాజేష్ అన్నారు. ఇంకా నిర్మాత ఎస్‌కేఎన్, సంగీత దర్శకుడు మణిశర్మ , నిర్మాత ధీరజ్ మొగిలినేని కూడా మాట్లాడారు.

# 3కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన దురంధర్-2

రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది.

దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.



# తెలంగాణలో ఇప్పసారా రాజకీయం

## - అనిరుధ్ రెడ్డి హెల్తీ ప్రచారం వెనుక అసలు వ్యూహమేంటి?

**(జె.సతీష్ - ప్రశ్న న్యూస్)**

తెలంగాణలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేస్తున్న ఇప్పసారా ప్రచారం ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. సాధారణంగా మద్యం నియంత్రణపై మాట్లాడాల్సిన పాలకపక్ష ఎమ్మెల్యే, ఏకంగా సారాను ప్రోత్సహించాలని, దానికోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. దీనికి మద్దతుగా సుమారు 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంతకాలను సేకరించి చాలా మద్దతు ఉందని నిరూపించే ప్రయత్నం చేస్తూంటే ఇది కేవలం ఒక్క ఎమ్మెల్యే వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే కాదని, దీని వెనుక ప్రభుత్వ పెద్దల మద్దతు ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### - ఆరోగ్య ప్రదాయిని.. కోట్లలో ఆదాయం

అనిరుధ్ రెడ్డి తన వాదనను చాలా తెలివిగా వినిపిస్తున్నారు. విదేశీ విస్కీలు, బ్రాందీలు తాగి జనం 60 ఏళ్లకే చనిపోతున్నారని, అదే ఇప్పసారా తాగితే 100 ఏళ్లు బతుకుతారని ఆయన పేర్కొంటున్నారు. దీన్ని తెలంగాణ టెకిలా గా అభివర్ణిస్తూ, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఇది దోహదపడుతుందని, ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం తెచ్చిపెడుతుందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాల్లో హీరోలు తాగితే లేని తప్పు, తాను ప్రజల మేలు కోసం మాట్లాడితే తప్పా అని ఆయన ప్రశ్నిస్తున్నారు.

### - బీజేపీ సెటైర్లు - ఇందిరమ్మ పేరు వద్దంటూ చలోక్తులు

అసెంబ్లీలో ఈ చర్చ జరుగుతున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వేసిన సెటైర్లు నవ్వులు పూయించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకానికి ఇందిరమ్మ పేరు పెడుతోందని, రేపు పొద్దున్న ఈ సారా బ్రాండ్‌కు కూడా ఆ పేరు పెట్టి గౌరవనీయ నేతను అవమానించవద్దని ఆయన ఎద్దేవా చేశారు. దీనిపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం కూడా చోటుచేసుకుంది. ప్రభుత్వ ఇప్పసారాని తీసుకొచ్చే ఉద్దేశంలో ఉందని ఇలాంటి అనుమానాల్ని బలపరుస్తున్నాయి.

### - ఇప్పసారాను ఎప్పుడు.. ఎందుకు నిషేధించారు?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సారా అనేది ఒక పెను శాపంగా మారింది. 1990వ దశకంలో గ్రామీణ ప్రాంతాల్లో సారా వల్ల కుటుంబాలు చితికిపోయాయి. మహిళల పోరాటాల ఫలితంగా 1993లో ఎన్.టి. రామారావు ప్రభుత్వం సారాను పూర్తిగా నిషేధించింది. సారా తయారీలో నాణ్యత లేకపోవడం, మిథనాల్ వంటి ప్రమాదకర రసాయనాలు కలపడం వల్ల కల్తీ సారా మరణాలు సంభవించేవి. పేద కుటుంబాల్లో సంపాదన అంతా సారాకే ఖర్చవ్వడం వల్ల సామాజిక సమస్యలు తలెత్తాయి. అప్పటి నుండి ప్రభుత్వాలు మద్యం అమ్మకాలను తమ నియంత్రణలోకి తీసుకున్నాయి.

### - ప్రభుత్వ ప్రయోగాత్మక వ్యూహం.?

రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా, కొత్త ఆదాయ వనరుల కోసం ప్రభుత్వం అనిరుధ్ రెడ్డితో ఈ బెలూన్



టెస్ట్ చేయిస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి వ్యతిరేకత రాకపోతే, దీన్ని ఒక హెల్త్ డ్రింక్, ఆర్గానిక్ లిక్కర్' పేరుతో మార్కెట్లోకి తెచ్చే అవకాశం ఉంది. ఒకవేళ విమర్శలు వస్తే, అది ఎమ్మెల్యే వ్యక్తిగత అభిప్రాయమని సర్దిచెప్పే వెసులుబాటు కూడా ప్రభుత్వానికి ఉంటుంది. ఏది ఏమైనా, నిషేధిత సారాకు వైద్యం రంగు పూసి తిరిగి తీసుకురావాలన్న ప్రయత్నం మాత్రం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

---

## రన్ ఫర్ జీసస్ ను విజయవంతం చేయగలరు

**ఎం సి పి ఎఫ్ ప్రెసిడెంట్ ఐతు డేవిడ్**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపాలిటీ పరిధిలోని 4 తారీకు శనివారం రోజు ఉదయం 7 గంటల కు ప్రారంభమై మంథని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు నుండి శ్రీ పా ద చౌకు అంబేద్కర్ విగ్రహం మీదుగా బస్ డిపో నుండి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల మీదుగా ఎస్ బి ఐ బ్యాంకు నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమం విజయవంతం చేయగలరు అనంతరం బేతేల్ గాస్పల్ ప్రేయర్ మినిస్ట్రీస్ ఎరుకల గూడెం ఆవరణంలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించబడును ఈ హెల్త్ క్యాంపులో మందులు ఉచితంగా ఇవ్వబడును ఈ అవకాశాన్ని మంథని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని మంథని నియోజకవర్గ పాస్టర్స్ సహవాస అధ్యక్షులు ఐతు డేవిడ్ ప్రకటనలో తెలిపారు

## బోయిన్ పేట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి కి ముదిరాజ్ కులస్థుల ఆత్మీయ సన్మానం.



మంథని ( ప్రశ్న న్యూస్)మున్సిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా సింహం గుర్తు మీద పోటీ చేసి అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష టిఆర్ఎస్. అభ్యర్థుల మీద ఒంటరి పోరాటం చేసి పెద్దపల్లి జిల్లా లోనే రికార్డ్ స్థాయిలో అత్యంత భారీ మెజారిటీ గెలుపొందిన పోతరవేని శ్రీలతక్రాంతి ని ఈరోజు బోయిన్ పేట్ కు చెందిన ముదిరాజ్ కుల పెద్దమనిషుల సమక్షంలో శావువాతో ఘనంగా సన్మానించారు..అనంతరం పోతరవేని శ్రీలతక్రాంతి మాట్లాడుతూ బోయిన్ పేట్ అభివృద్ధి కి నిరంతరం కృషిచేస్తామని ఇంతటి ఘన విజయాన్ని అందించిన బోయిన్ పేట్ 6వార్డ్ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు..ఈ కార్యక్రమంలో బోయిన్ పేట్ ముదిరాజ్ కుల పెద్దమనుషులు మహిళలు ముదిరాజ్ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## పార్లమెంట్‌లో తెలంగాణ హక్కులపై గట్టిగా స్వరం వినిపించిన.

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ



మంథని( ప్రశ్న న్యూస్) పార్లమెంట్‌లో మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తెలంగాణ హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాల అంశాలపై విస్తృతంగా ప్రస్తావించారు. 1969 తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేస్తూ, అప్పటి పోరాట స్ఫూర్తి ఇప్పటికీ అవసరమేనని అన్నారు. ఆ సమయంలో కాకా వెంకట స్వామి సహా అనేక మంది నాయకులు తెలంగాణ కోసం చేసిన త్యాగాలను స్మరించారు.నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందనే కారణంతోనే ఉద్యమం జరిగింది. కానీ ఈ రోజు వరకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు కాలేదు" అని ఆయన పేర్కొన్నారు.నీటి అంశంలో ముఖ్యంగా కృష్ణా నది మరియు గోదావరి నది నీటి నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదిత బంకచల్ల ప్రాజెక్టు అమల్లోకి వస్తే, తెలంగాణకు హక్కుగా రావాల్సిన సుమారు 200 టీఎంసీల నీరు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీని ప్రభావంతో ఉత్తర తెలంగాణ, ముఖ్యంగా పెద్దపల్లి ప్రాంతం ఎండబారే పరిస్థితి తలెత్తుతుందని రికార్డులో ఉంచాలని కోరారు.కేంద్ర నిధుల కేటాయింపులో అసమానత ఉందని విమర్శిస్తూ, తెలంగాణను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రైల్వే ప్రాజెక్టుల కేటాయింపులో కూడా నిధుల పంపిణీ సమానంగా జరగడం లేదని పేర్కొన్నారు.విమానాశ్రయాల విషయంలో కూడా తీవ్ర అసమానత ఉందని ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉండగా, తెలంగాణలో మాత్రం పరిమిత సదుపాయాలే ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా పెద్దపల్లి ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు డిమాండ్ చేసినప్పటికీ పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పోలవరం ప్రాజెక్టు కారణంగా భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల్లో వెనుకజల సమస్యలు తీవ్రమవుతున్నాయని, దాదాపు రెండు లక్షల మంది ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పరిశ్రమల విషయంలో పరిశ్రమల మార్గం, అర్ధవాహక తయారీ కేంద్రం వంటి ప్రాజెక్టులు తెలంగాణకు రావాల్సి ఉండగా ఇతర ప్రాంతాలకు మళ్లుతున్నాయని అన్నారు. రైతులు, ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి" అని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పార్లమెంట్‌లో స్పష్టం చేశారు.

## సుందరకాండ సందేశమే విజయానికి మార్గం

**- ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు**

**- వేములవాడ మాజీ సర్పంచ్ : పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే శ్రీ హనుమాన్ జయంతి పర్వదినం పురస్కరించుకొని వేములవాడ మాజీ సర్పంచ్ పొలాస నరేందర్ శుభాకాంక్షలు తెలిపారు.హనుమంతుడు ధర్మానికి ప్రతీకగా నిలుస్తాడని, ధర్మం ఉన్నచోట విజయమూ ఉంటుందని ఆయన అన్నారు. రామాయణంలోని సుందరకాండలో హనుమంతుడు సీతమ్మను దర్శించి, అశోకవనాన్ని ధ్వంసం చేసి, లంకకు అగ్ని పెట్టిన ఘట్టం చైత్ర పౌర్ణమి నాడే జరిగినందున ఈ రోజును విజయోత్సవంగా భావిస్తారని పేర్కొన్నారు. దక్షిణ భారతంలో హనుమత్ విజయోత్సవంగా, ఉత్తర భారతంలో హనుమాన్ జయంతిగా ఈ పర్వదినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. హనుమంతుడి భక్తి, బలం, విధేయతను స్మరించుకుంటూ ఈ పండుగను భక్తులు ఘనంగా నిర్వహిస్తారని, ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## న్యాయవాదుల భద్రతకు బలమైన అడుగు వేసిన తెలంగాణ సర్కారు

**న్యాయవాదుల భద్రత, గౌరవం వృత్తి స్వేచ్ఛకు రక్షణ**

**"తెలంగాణ న్యాయవాద రక్షణ చట్టం బిల్లు--2026" కీలక మైలురాయి**

**న్యాయ వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర అత్యంత ముఖ్యం**



**( తేజవ్యాస్ - ప్రశ్న న్యూస్)**

తెలంగాణ న్యాయవాద రక్షణ చట్టం బిల్లు--2026 న్యాయవాదుల భద్రతకు బలమైన అడుగుగా నిలిచింది. తెలంగాణలో న్యాయవాదుల భద్రత, గౌరవం, వృత్తి స్వేచ్ఛను కాపాడేందుకు "తెలంగాణ న్యాయవాద రక్షణ చట్టం బిల్లు--2026" ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. న్యాయ వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర అత్యంత ముఖ్యమైనది. అయితే ఇటీవల కాలంలో న్యాయవాదులపై భౌతిక , మానసిక దాడులు, బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో న్యాయశాఖ మంత్రి , హోంమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ఈ బిల్లు రూపుదిద్దుకోవడం విశేషం.

### న్యాయవ్యవస్థకు బలం

ఈ చట్టం అమల్లోకి వచ్చాక న్యాయవాదులు మరింత ధైర్యంగా తమ విధులు నిర్వర్తించగలరు. దీని వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం కూడా పెరుగుతుంది. న్యాయం కోసం పోరాడే వారికి రక్షణ ఉండటం సమాజానికి మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### న్యాయవాదుల అభిప్రాయం

ఈ బిల్లుపై రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ చట్టం తమకు రక్షణ కల్పిస్తుందని వారు భావిస్తున్నారు.

### ముగింపు

"తెలంగాణ న్యాయవాద రక్షణ చట్టం బిల్లు--2026" న్యాయవాదుల గౌరవాన్ని కాపాడటమే కాకుండా, న్యాయవ్యవస్థను మరింత బలపరచే దిశగా ఒక ముఖ్యమైన నిర్ణయం. ఇది అమల్లోకి వస్తే న్యాయవాదుల భద్రతకు కొత్త దిశకు దారినివ్వడం గమనార్హం.?

## నిజామాబాద్‌లో ట్రాఫిక్ అవస్థలు... విలేఖరిపై ట్రాఫిక్ పోలీస్ దురుసు ప్రవర్తన



నిజామాబాదు (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ నగరంలో రైల్వే పనుల కారణంగా ఇప్పటికే ట్రాఫిక్ డైవర్షన్‌లు అమల్లో ఉండగా అదనంగా ఏర్పడిన నిర్లక్ష్యం ప్రజలకు మరింత ఇబ్బందులను కలిగిస్తోంది. విజయ టాకీస్ సమీపంలోని రైల్వే కమాన్ వద్ద ఒక విద్యా సంస్థకు చెందిన వాహనం రోడ్డుపై పార్కింగ్ చేసి డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం కలిగింది. ఇరుకు రహదారుల కారణంగా వాహనదారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు.ఈ సమయంలో సమీపంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ ఫోన్‌లో మాట్లాడుతుండగా, పరిస్థితిని గమనించిన ఒక విలేఖరి ట్రాఫిక్ క్లియర్ చేయాలని సూచించారు. అయితే, ఇందుకు స్పందించిన ట్రాఫిక్ పోలీస్ "నువ్వెవరు చెప్పడానికి?" అంటూ దుర్భాషలాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఫోటోలు, వీడియోలు తీయకుండా అడ్డుకోవడంతో పాటు విలేఖరిని అవమానించిన ఘటన స్థానికుల్లో ఆగ్రహం రేకెత్తించింది.అంతేకాకుండా, సంబంధిత విలేఖరి వ్యక్తిగత వివరాలు-పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ వంటి సమాచారం కూడా నోట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్థానికులు తీవ్రంగా స్పందిస్తూ "ప్రశ్నిస్తే అవమానిస్తారా?" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పత్రికా వర్గాలు ఈ సంఘటనను ఖండిస్తూ, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. పత్రికా భాషలో ఉపయోగించని అసభ్య పదజాలాన్ని వినియోగించడం ఎంతవరకు సమంజసం అని విలేఖరులు ప్రశ్నిస్తున్నారు.ఇదిలా ఉండగా, ట్రాఫిక్ పోలీస్‌లు బాధ్యతలు విస్మరించి ఫోన్‌లకు పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ (సీపీ) తక్షణమే స్పందించి, దురుసుగా ప్రవర్తించిన ట్రాఫిక్ పోలీస్‌పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి.

## ధర్మానికి ప్రతీక హనుమంతుడు

**- ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు**

**- భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే శ్రీ హనుమాన్ జయంతి పర్వదినం పురస్కరించుకొని భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు అనుమల్ల చంద్రమౌళి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతుడు ధర్మానికి ప్రతీకగా నిలుస్తాడని, ధర్మం ఉన్నచోట విజయమూ ఉంటుందని ఆయన అన్నారు. రామాయణంలోని సుందరకాండలో హనుమంతుడు సీతమ్మను దర్శించి, అశోకవనాన్ని ధ్వంసం చేసి, లంకకు అగ్ని పెట్టిన ఘట్టం చైత్ర పౌర్ణమి నాడే జరిగినందున ఈ రోజును విజయోత్సవంగా భావిస్తారని పేర్కొన్నారు.దక్షిణ భారతంలో హనుమత్ విజయోత్సవంగా, ఉత్తర భారతంలో హనుమాన్ జయంతిగా ఈ పర్వదినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. హనుమంతుడి భక్తి, బలం, విధేయతను స్మరించుకుంటూ ఈ పండుగను భక్తులు ఘనంగా నిర్వహిస్తారని అన్నారు.

## మానవతా విలువలు చాటిన కరీంనగర్ రూరల్ పోలీసులు

**- వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించిన కరీంనగర్ రూరల్ పోలీసులు**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ రూరల్ పోలీసుల మానవతా దృక్పథం మరోసారి వెలుగులోకి వచ్చింది. అనాథ స్థితిలో ఇబ్బందులు పడుతున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి వారికి ఆశ్రయం కల్పించారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం, వెల్లుల్ల గ్రామానికి చెందిన శ్రీరామ్ అంజయ్య (75), పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతానికి చెందిన బూర్గు రాజయ్య (80), కరీంనగర్ జిల్లా దేశరాజుపల్లి గ్రామానికి చెందిన అవుదుర్తి సతీష్ (45) అనువారు తమ గ్రామాల్లో అనాథలుగా జీవిస్తూ తిండి, ఆరోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం అందింది. దీనిపై స్పందించిన కరీంనగర్ రూరల్ పోలీసులు వారిని వెంటనే కరీంనగర్‌కు రప్పించారు. ముగ్గురికి ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. అనంతరం వారి సంరక్షణ కోసం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న విబి ఫౌండేషన్ (వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం)కు అప్పగించారు. ఆశ్రమ నిర్వాహకులు వీరమాధవ్‌కు వారిని బాధ్యతగా అప్పగిస్తూ శాలువాలతో సత్కరించి, తక్షణ అవసరాల కోసం మందులు, పండ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి పాల్గొని, అనాథల పట్ల చూపిన చిత్తశుద్ధికి పోలీసులను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలకు రెడ్ క్రాస్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమానికి హాజరైన స్థానికులు పోలీసుల సేవలను ప్రశంసిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి, ఎస్సైలు నరేష్, లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.అనాథలు ఎవరైనా గుర్తిస్తే కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహనా కార్యక్రమం



అమీన్‌పూర్( ప్రశ్న న్యూస్) అమీన్పూర్ ఎస్ ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఫైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్ల పక్కన ఉన్న చిరు వ్యాపారులకు ఫైబర్ నేరాల తీరును వివరించారు. బీరంగూడ సోమవారం మార్కెట్ ప్రాంగణంలో తోపుడు బండ్లపై పండ్లు కూరగాయలు అమ్ముకునే చిరువి వ్యాపారులందరిని ఒకచోట చేర్చి ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు. సైబర్ క్రైమ్ బారిన పడితే తక్షణమే సైబర్ క్రైమ్ నెంబర్ 1960 కి సమాచారం ఇవ్వడం ద్వారా సైబర్ మోసగాళ్లను తక్షణమే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఇక అక్రమ రేషన్ బియ్యం దందా షురూ

- రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాపై చర్యలేవి.? - 3 నెలల బియ్యం ఏప్రిల్ లో ఇవ్వడంతో కోట్లల్లో వ్యాపారం
- "పేదల బియ్యం కాపాడలేని ప్రజా ప్రతినిధుల పాలన.? - ప్రభుత్వం ప్రజల నమ్మకం ఎలా గెలుచుకుంటుంది.?
- జిల్లా ఎస్పీలు, కమిషనర్లు ప్రత్యేక చొరవ చూపెడితేనే కట్టడి


ప్రజాప్రశ్న
మాజీమంత్రి హరీష్ రావు ఇలాకాలో అక్రమ రేషన్ బియ్యం దందా




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** పేదల అన్నం, అక్రమార్కుల బంగారం రేషన్ బియ్యం పేదల ఆహార భద్రతకు ప్రాణాధారం. కానీ అదే బియ్యం ఇప్పుడు అక్రమార్కులకు కోట్ల రూపాయల ఆదాయ వనరుగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) ద్వారా అందాల్సిన బియ్యం భారీగా దారి మళ్లి, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పేదలకు అందాల్సిన ధాన్యం మిల్లులకు, ఇతర రాష్ట్రాలకు, కొంతవరకు విదేశాలకు కూడా అక్రమంగా తరలిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినా ప్రభుత్వం కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం చెందుతుంది. కొంతమంది రాజకీయ నాయకుల అనుసైగల్లోనే ఈ దందా జరుగుతుందని అందుకోసమే పోలీసులు కూడా రాజకీయ వత్తుళ్లకు తలొగ్గి మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### సివిల్ సప్లై శాఖ అధికారుల పూర్తి వైఫల్యం..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో సివిల్ సప్లై శాఖ పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగితాలపై


ప్రజాప్రశ్న
రేషన్ బియ్యం అక్రమ దందాకు
సర్వం సిద్ధం

తనిఖీలు, గణాంకాల ప్రదర్శన తప్ప క్షేత్ర స్థాయిలో ఎలాంటి కట్టుదిట్టమైన చర్యలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతి జిల్లాలో డిసిఎస్ఓ ల కనుసైగల్లోనే ఈ దందా జరుగుతోందని ప్రతినెల అధికారులకు భారీగా మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే ప్రజలు అనేక ఫిర్యాదులు చేసిన పత్రికలలో కథనాలు, సామాజిక మధ్యమాలలో వీడియోలు చెక్కర్లు కొడుతున్న అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులకు పూర్తి సమాచారం ముందుగానే ఉండడంతో అసలు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

### పోలీసుల కనుసైగల్లోనే దందా.?

అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, ఈ అక్రమ రేషన్ బియ్యం రవాణా కొంతమంది పోలీసుల కనుసైగల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో లారీలు, చిన్న వాహనాల


ప్రజాప్రశ్న
మామూళ్లు కొట్టు, అక్రమ బియ్యం దందా పెట్టు

ద్వారా బియ్యం తరలింపులు నిరాటంకంగా సాగుతున్నా, రహదారులపై, చెక్‌పోస్టుల్లో తనిఖీలు లేకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. అంటే ఉదయం, రాత్రి వేళలో రహదారులపై పోలీసుల నిఘా అసలు లేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకోసమే పోలీసులు అక్రమ రేషన్ బియ్యం రవాణాను అడ్డుకోలేకపోతున్నారని స్థానికంగా పోలీస్ స్టేషన్లలో ముందుగానే సమాచారం ఉంటుందని బాధాకరమేమంటే ఎస్ఓటి పోలీసులు కూడా దాడులు చేయకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. పలు చోట్ల స్థానిక ఒప్పందాలతో అక్రమ వ్యాపారం కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు యదేచ్ఛగా జరుగుతున్న ఈ అక్రమ రేషన్ బియ్యం మాఫియా పై ఎందుకు దృష్టి సారించడం లేదో.?

### కోట్లకు పడగలెత్తిన మాఫియా.?

తెలంగాణ రాష్ట్రంలో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చిన్న స్థాయి దందా కాదు. ప్రస్తుతం అది ఒక పెద్ద మాఫియాగా మారింది. ప్రతి జిల్లాలో కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్న భారీ నెట్‌వర్క్‌గా మారింది. మిల్లర్లు, మధ్యవర్తులు, రవాణాదారులు, కొందరు అవినీతి అధికారులు కలిసి వ్యవస్థను దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్ల పేరుతో భారీ షెడ్లు నిర్మాణం చేసుకొని కేవలం అక్రమ రేషన్ బియ్యం దందా నిర్వహించడానికి వాటిని ఉపయోగిస్తున్నారని కొంతమంది రైస్ మిల్లు పేరుకు మాత్రం నిర్వహిస్తూ బ్యాక్ డోర్ లో అక్రమ రేషన్ బియ్యం దందా యదేచ్ఛగా జరిపిస్తున్నారని ఇది కూడా అన్ని శాఖల అధికారుల కనుసైగల్లోనే అని స్థానికులు విమర్శిస్తున్నారు.

### పేదల ఆహార భద్రతకు ముప్పు..?

ఏప్రిల్ నుండి 3 నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడంతో రేషన్ బియ్యం దారి మళ్లడంతో నిజమైన లబ్ధిదారులకు సరఫరా లోపిస్తోంది. కార్డులు ఉన్నా సరైన పరిమాణంలో బియ్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిభట్ల బొంగులూరు గేటు, పెద్ద అంబర్పేట్ ప్రాంతాలలో యదేచ్ఛగా జరుగుతుందని ఇది కేవలం అవినీతి సమస్య కాదు, పేదల ఆహార భద్రతపై నేరుగా దెబ్బ. ఇంత భారీ స్థాయిలో మాఫియా జరుగుతున్న ఎందుకు మంత్రులు ముఖ్యమంత్రి, సివిల్ సప్లై, పోలీసు ఉన్నత అధికారులు దీనిపై ఉక్కు పాదం మోపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. బహిరంగంగా జరుగుతున్న ఈ అక్రమ రేషన్ బియ్యం రవాణా మాఫియా తో అధికారులకు గట్టి ఆర్థిక సంబంధాలే ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం.?

ప్రజల నుండి ఇన్ని ఆరోపణలు, పత్రికా కథనాలు వెలుగులోకి వస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కఠిన చర్యలకు ఎలాంటి పట్టుదల కనిపించడం లేదు. అప్పుడప్పుడూ దాడులు, స్వల్ప కేసులు నమోదు తప్ప పెద్ద ముఠాలను ఛేదించే చర్యలు కూడా లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. జిల్లా సివిల్ సప్లై అధికారులు ఈ వ్యవస్థను వెనక ఉండి నడిపిస్తున్నారని ఇది అధికార యంత్రాంగంపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.

### జిల్లా ఎస్పీలు, కమిషనర్లు స్పందించేది ఎప్పుడు.?

డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ల (డిసిఎస్ఓ) అవినీతి అక్రమాలకు ఈ అక్రమ రేషన్ బియ్యం దందా జరుగుతుందన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. అయితే వాటిని పోలీసు శాఖ మాత్రమే కట్టడి చేయగలదన్న సూచనలు వినిపిస్తున్నాయి.ప్రతి జిల్లాలో ఈ దందా బహిరంగంగానే సాగుతుంటే, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, కలెక్టర్లు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేసి, మూలాలను బట్టబయలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దీశీఇ


### 3 నెలలు ఒకేసారి ఇవ్వడంతో భారీ స్థాయిలో దందా

ఏప్రిల్ నెలలో 3 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ప్రభుత్వం ఏప్రిల్ నెలలో ఒకేసారి ఇవ్వడంతో ఇక మాఫీ ఆకు కోట్ల సంపద రాబోతుందని కాబట్టి ఈ నెల భారీ స్థాయిలో అక్రమ రేషన్ బియ్యం దందా జరుగుతుందని ప్రజలు తెలుపుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయాలని సంబంధిత అధికారులపై కూడా బాధ్యత విధించి విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని టెక్నాలజీ ఆధారిత ట్రాకింగ్, జీపీఎస్ పర్యవేక్షణ, సామాజిక విజిలెన్స్ కమిటీలతో వ్యవస్థను బలోపేతం చేయాలి. లేకపోతే పేదల అన్నం ఇలాగే దోపిడీకి గురవుతూనే ఉంటుంది. కాబట్టి కట్టడి చేయాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికి.

# నిఘా నీడలో నిశ్శబ్దం

- విజిలెన్స్ వైఫల్యం.. అవినీతికి వరం - మౌనమే 'ముడుపుల'కు మూలమా.?
- ఏసీబీ వర్సెస్ విజిలెన్స్ ఎవరు బాధ్యులు.? - వ్యవస్థ ప్రక్షాళన ఎప్పుడు.?



**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి అనేది ఒక అంటువ్యాధిలా విస్తరిస్తోంది. సామాన్యుడి చెమట చుక్కల నుంచి పుట్టిన పన్నుల ద్వారా జీతాలు పొందుతున్న అధికారులు, సిబ్బంది ఆ జీతం చాలదన్నట్టు 'లంచం' అనే అదనపు ఆదాయానికి అలవాటు పడిపోతున్నారు. వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన విజిలెన్స్ విభాగం వాళ్లతో చేతులు కలిపి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, అవినీతి తిమింగలాలు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి.

### మౌనమే 'ముడుపుల'కు మూలమా.?

ఏ ప్రభుత్వ శాఖలోనైనా అక్రమాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాల్సిన బాధ్యత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే విజిలెన్స్ విభాగం మౌనంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంతో పోలిస్తే అకస్మిక తనిఖీలు మందగించాలని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో లంచావతారులు బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### ఏసీబీ వర్సెస్ విజిలెన్స్ ఎవరు బాధ్యులు.?

ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ దాడులు ఒక చేదు నిజాన్ని బయటపెట్టాయి. కింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి అధికారుల వరకు ప్రతి పనికీ రేట్లు ఫిక్స్ చేస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఏసీబీ దాడుల్లో ఎక్కువగా చిరుద్యోగులే దొరుకుతుండటం గమనార్హం. మరి ఈ వ్యవస్థను వెనుక నుండి నడిపిస్తున్న 'పెద్ద తిమింగలాల' సంగతేంటి. ? వారి వరకు ఏసీబీ పంజా చేరడం లేదా.? అన్నది మిగిలి ఉన్న పెద్ద ప్రశ్న. నిఘా సంస్థలు నిష్క్రియగా ఉండటంతో, లంచావతారులు పూటకొకరు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని, పనులు పెండింగ్‌లో పెట్టి, మానసిక ఒత్తిడికి గురిచేసి డబ్బులు గుంజుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులను కూడా 'లంచం' ఇస్తేనే పనులు జరుగుతున్నాయని ప్రజల నుంచి అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఇది వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనం.

### వ్యవస్థ ప్రక్షాళన ఎప్పుడు.?

అప్పుడప్పుడు జరిగే ఏసీబీ దాడులతో అవినీతి అంతం కాదు. విజిలెన్స్ విభాగం తన నిర్లక్ష్యపు నిద్రను పూర్తిగా వీడాలి. ప్రతి శాఖపై నిరంతర నిఘా ఉండాలి. కేవలం కింది స్థాయి సిబ్బందిని కాకుండా, అవినీతికి మూల కారణమైన పై స్థాయి అధికారుల అక్రమ ఆస్తులపై నిరంతరం దృష్టి సారించాలి.

లంచం అడిగే అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకునేలా ఒక బలమైన వ్యవస్థను రూపొందించాలి. "విజిలెన్స్.. సైలెన్స్" గా ఉంటే అది సమాజానికి ప్రమాదకరం. నిఘా వ్యవస్థలు చురుగ్గా పనిచేయనంత కాలం, సామాన్యుడికి న్యాయం అసలే జరగదు. అవినీతి అధికారుల గుండెల్లో వణుకు పుట్టించాల్సిన సంస్థలే మౌనం పాటిస్తే, అది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు. ఇప్పటికైన పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి, వ్యవస్థలో పేరుకుపోయిన ఈ 'అవినీతి మురికిని' కడిగేయాల్సిన అవసరం చాలా ఉంది.

## కాజీపేట రైల్వే డివిజన్‌ను
# తక్షణమే ఏర్పాటు చేయండి

- అశ్వినీ వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. కేటీఆర్ రాసిన లేఖను బీఆర్ఎస్ ఎంపీల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రికి అందించింది. ఈ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ ఎంపీలు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ ట్రాక్ పరిధి 2,755 కిలోమీటర్లుగా ఉందని, మున్ముందు వాడి–రాయచూర్, విష్ణుపురం–బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ట్రాక్ పరిధి 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది ఎక్కువ అన్నారు. ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం కారణంగా సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కాజీపేట కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేస్తే పరిపాలనా సులువు అవుతుందని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా కాజీపేట డివిజన్ అత్యవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు.

## కాల్పుల విరమణ కోసం
# ఇరాన్ కొత్త లీడర్ అభ్యర్ధించారు

- డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు.ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు
# తెలంగాణ బీజేపీ మద్దతు

- సుదీర్ఘ పోరాటం తర్వాతే తెలంగాణ ఏర్పడింది



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు.దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరఫున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588